ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 3 జనవరి 2025

ప్రత్యేక దర్శనాలు షురూ

- వృద్ధులు, చంటిపిల్లల తల్లులు, దివ్యాంగులకు బ్రేక్ తరహా దర్శనాలు

యాదాద్రి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. మరోవైపు రద్దీకి అనుగుణంగా భక్తులకు స్వామివారి దర్శనానికి ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఉద్ఘాటనకు ముందు సాధారణ రోజుల్లో రోజువారీగా 6నుంచి 10 వేల మంది వరకు దర్శించుకోగా, సెలవు రోజుల్లో 30వేలకు పైగా భక్తులు దర్శించుకునేవారు. అయితే ఉద్ఘాటన అనంతరం భక్తుల తాకిడి పెరిగింది. ప్రస్తుతం సాధారణ రోజుల్లో 20వేల మంది భక్తులు దర్శనాలు చేసుకుంటుండగా, సెలవు రోజుల్లో 50వేల వరకు విచ్చేస్తున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ నెల 1న 70వేలకు పైగా మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఒక్కరోజు ఆదాయం రూ.83లక్షలు వచ్చింది. కొండపైకి ప్రవేశ వాహనాలు ద్వారానే రూ.9లక్షలు (1,800 వాహనాలు గుట్టపైకి వచ్చాయి.), ప్రసాద విక్రయం ద్వారా రూ.30లక్షల వరకు ఆదాయం వచ్చింది. దీన్ని బట్టి ప్రత్యేక సెలవురోజుల్లో ఎంతమంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకుంటున్నారో అంచనా వేయొచ్చు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా..

(మిగతా 6వ పేజీలో)



మళ్లీ భయపెడుతున్న ఫ్లోరైడ్



- ఉమ్మడి జిల్లాలోని భూగర్భజలాల్లో నాణ్యతా లేమి
- నీటిలో పరిమాణానికి మించి నైట్రేట్, ఆర్సనిక్, ఐరన్, సోడియం మూలకాలు
- తాగడానికే కాదు, సాగుకూ ఉపయుక్తం కాదంటున్న నివేదికలు
- కేంద్ర భూగర్భజలాల నాణ్యత నివేదికలో మోగిన డేంజర్‌బెల్స్
- మర్రిగూడ మండలంలో గర్భిణుల్లో ఫ్లోరోసిస్ లక్షణాల నిర్ధారణ
- కృష్ణా జలాలు అందించడమే పరిష్కారం



ఉమ్మడి జిల్లాను ఫ్లోరైడ్ భూతం వీడటం లేదు. విచ్చలవిడిగా భూగర్భజలాల వినియోగం, అదుపులేని పరిశ్రమల కాలుష్యంతో భూగర్భజలాల నాణ్యత పడిపోయింది. ఫ్లోరైడ్‌తో పాటు, నైట్రేట్స్, ఇనుము, ఆర్సనిక్ పరిమాణాలు పెరిగాయి. వీటి పెరుగుదలతో ప్రాణాంతక క్యాన్సర్, మూత్రపిండాల రోగాలు, కాళ్లు చేతులు చచ్చుబడడం, దంతక్షయం, పంటలకు అవసరమైన పోషకాలు అందకపోవడంతో నాణ్యతలేని ఆహార ఉత్పత్తులు దిగుబడి అవుతున్నాయి. దేశంలో అత్యధిక ఫ్లోరైడ్, నాణ్యతలేని భూగర్భజలాలు ఉన్న జిల్లాగా యాదాద్రి జిల్లా నిలిచింది. ఉమ్మడి జిల్లాలోని భూగర్భజలాలు సాగుకు, తాగు నీటికి అంత ఉపయుక్తకరం కాదని తాజాగా కేంద్ర జలశక్తి శాఖ విడుదల చేసిన భూగర్భజలాల నాణ్యత నివేదిక వెల్లడిస్తోంది.

- ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ప్రభుత్వాలు దశాబ్దాలుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఫ్లోరైడ్ బాధ నుంచి, మూసీ నది కాలుష్యం నుంచి ఉపశమనం కల్పిస్తామని పదేపదే హామీలిస్తున్నా, అందుకు అవసరమైన ఉపరితల జలాలను జిల్లాకు అందించడంలో విఫలమవుతున్నాయి. తాగునీటికి మిషన్‌భగీరథ వంటి పథకాలు, ఆర్వో ప్లాంట్ల ద్వారా నీటిశుద్ధి జరుగుతుండడంతో కొంతమేర ఇబ్బందులు తగ్గినా, ఉమ్మడి జిల్లాలోభూముల్లో, భూగర్భజలాల్లో పేరుకుపోయిన ఫ్లోరైడ్, ఇతర ప్రమాదకర మూలకాలు తొలగాలంటే భూగర్భజలాల వినియోగం తగ్గడం, ఉపరితల జలాల వినియోగం పెరగడమే ఏకైక నివారణ మార్గం. ప్రభుత్వం ఇప్పటికైనా ఉమ్మడి జిల్లాలో వందశాతం ఉపరితల జలాలు అందించే ఎస్‌ఎల్‌బీసీ, డిండి, గోదావరి జలాల పథకాలను పూర్తిచేయడంతో పాటు, మూసీ ప్రక్షాళన, పరిశ్రమల కాలుష్యాన్ని నివారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

వదలని ఫ్లోరైడ్ భూతం

కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన భూగర్భజలాల నాణ్యత నివేదిక ప్రకారం దేశంలోనే అత్యధిక ఫ్లోరైడ్ నమోదైన 15 జిల్లాల్లో యాదాద్రి జిల్లా ఒకటిగా నిలిచింది. అదేవిధంగా నల్లగొండ జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లోనూ ఫ్లోరైడ్ శాతం ఇటీవల పెరిగింది. గడచిన పదేళ్లలో భూగర్భజలాల్లో 2015 నుంచి 2022 వరకు వరుసగా పెరుగుతూ వచ్చిన ఫ్లోరైడ్ 2023లో 2021కి సమానంగా నమోదైంది. 2015లో నీటిలో 20శాతం ఉన్న ఫ్లోరైడ్ 2022 నాటికి 32శాతానికి చేరింది. యాదాద్రి జిల్లాలో 43 నమూనాలు సేకరించి పరీక్షించగా, అందులో 49 శాతం అంటే 21 శాంపిళ్లలో ఫ్లోరైడ్ 1.5ఎంజీ/లీటర్ కంటే ఎక్కువగా నమోదైంది. యాదాద్రి జిల్లాలో సగటున 6.54 శాతం నమోదయితే, నల్లగొండలోనూ 5.89 శాతంగా నమోదైంది. నల్లగొండ జిల్లాలోని మర్రిగూడ మండలంలో ఇటీవల నిర్వహించిన ఫ్లోరైడ్ సర్వేలోనూ ఫ్లోరోసిస్ మూలాలున్నట్టు అధికారులు గుర్తించారు. అయితే శాంపిళ్లకు సంబంధించిన తుది ఫలితాలు రానందున లక్షణాలు గుర్తించినట్లుగానే చెబుతున్నా నిర్ధారించడం లేదు.

పెరిగిన రసాయనాలు, కాలుష్యకారకాలు

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా

మిగతా 7వ పేజీలో...

గర్భిణుల్లో లక్షణాలు కనిపించడంతో పరీక్షలకు పంపాం

మర్రిగూడ మండలంలో ఇటీవల నిర్వహించిన ఫ్లోరోసిస్ పరీక్షల్లో గర్భిణుల్లో లక్షణాలు కనిపించడంతో మూత్ర నమూనాలను పరీక్షలకు పంపాం. ఆ నివేదికలు రావల్సి ఉంది. ఇతరుల్లో ఫ్లోరోసిస్ లక్షణాలేవీ కనిపించలేదు. కొత్తగా ఫ్లోరోసిస్ ఎవరికీ రాలేదు. పాతవారిలోనూ ఆ ప్రభావం తగ్గింది.

డాక్టర్ శాలిని, వైద్యాధికారి, మర్రిగూడ



శాశ్వత పరిష్కారం కోసం ఎస్‌ఎల్‌బీసీ సొరంగం, డిండి ఎత్తిపోతల పూర్తిచేయాలి

ప్రభుత్వాలు ఉపశమన చర్యలు ఎన్ని చేపట్టినా శాశ్వత పరిష్కారమార్గం చూపడం లేదు. కృష్ణానది జలాలను పూర్తిస్థాయిలో అందించినప్పుడే ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారమవుతుంది. 35 ఏళ్లుగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసినా ఫలితం దక్కకపోవడం బాధాకరం. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్, డిండి ఎత్తిపోతల పథకం పూర్తయితేనే ఫ్లోరోసిస్ నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

కంచుగట్ల సుభాష్, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు



జిల్లాకు పేరు తెచ్చేలా కృషి చేయాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో అధికారులు, సిబ్బంది జిల్లాకు మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు, బెడ్‌షీట్లు, నోట్ పుస్తకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, సామాజిక, ఆర్థిక, సమగ్ర కుటుంబ సర్వేలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇదే ఒరవడిని నూతన సంవత్సరంలో కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి అమరేందర్, ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, సర్వే లాండ్స్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, పాల్గొన్నారు.

టెట్ పరీక్షా కేంద్రం తనిఖీ

ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించే టెట్ ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలాత్రిపాఠి తనిఖీ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రానికి 180మంది అభ్యర్థులను కేటాయించగా, 118 మంది హాజరైనట్టు నిర్వాహకులు వివరించారు. కలెక్టర్ వెంట డీఈవో భిక్షపతి ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్, నాంపల్లి): విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం కనగల్ కేజీబీవీని ఆమె తనిఖీ చేసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు అందజేశారు. పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అదనపు తరగతులను ప్రభుత్వం మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పద్మ, ఎంఈవో పద్మ, ఎంపీవో సుమలత ఉన్నారు. నాంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీచేశారు. 'ధరణి' పెండింగ్ దరఖాస్తుల వివరాలు తహసీల్దార్ దేవ్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు.

అక్షయపాత్ర కోసం స్థలం పరిశీలన

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): హరేకృష్ణ సంస్థ ద్వారా గురుకులాలు ఇతర ప్రభుత్వ సంస్థలకు భోజనం సరఫరా చేసే అక్షయ పాత్ర కోసం మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ ఇలాత్రిపాఠి గురువారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం అమలవుతున్న విద్యా సంస్థలు, వసతి గృహాలు, అన్నపూర్ణ క్యాంటీన్‌లకు భోజనం సరఫరా చేసేందుకు ప్రభుత్వం హరేకృష్ణ సంస్థకు బాధ్యతలు అప్పజెప్పే ఆలోచనలో ఉంది. అందులో భాగంగా అక్షయపాత్ర వంటశాల, ఇతర నిర్మాణాలకు ఎకరం స్థలం కోసం ఎల్లారెడ్డిగూడెంలో హరిత హోటల్‌కు ఇవ్వనున్న స్థలం పక్కన స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ తరుణ్, వడ్డే భూపాల్‌రెడ్డి, కిట్టు, అశోక్ ఉన్నారు.



నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి కలెక్టర్ ఇలాత్రిపాఠికి దుప్పట్లు అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

- చిన్న పిల్లలతో వెట్టి చాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు
- బాలకార్మికులు కనిపిస్తే 1098, 100కు డయల్ చేయాలి
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పాల్గొన్న అదనపు ఎస్పీ రాములునాయక్

నల్లగొండ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎంతటి వారైనా చిన్న పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే కేసులు నమోదు చేయాలని, బాల కార్మికులు కనిపిస్తే 1098, 100కు డయల్ చేసే సమాచారం ఇవ్వాలన్నారు. నిరాదరణకు గురైన, తప్పిపోయిన, వెట్టి చాకిరికి గురవుతున్న బాలబాలికలను గుర్తించి వారిని సంరక్షించడం మనందరి బాధ్యత అన్నారు. అందు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, అదేవిధంగా జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జనవరి ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు నెలరోజులపాటు పోలీస్ అధికారులు, బాల కార్మిక, విద్యా, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి పని చేసే పిల్లలను గుర్తించాలన్నారు. 18 ఏళ్లలోపు వారిని గుర్తించిన వెంటనే, తల్లిదండ్రులకు లేదంటే స్టేట్‌హోంకు తరలించాలన్నారు. బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ అరుణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కృష్ణవేణి, బాల కార్మిక, విద్యా, ఆరోగ్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మరణించినా జీవించు..

- అవయవ దానంతో ఆర్తుల జీవితాలకు వెలుగు

6



కొనుగోలు చేస్తామని పిలిచి.. పొమ్మన్నారు

7 చండూరు మండలంలో పత్తి రైతుల రాస్తారోకో

నేడు, రేపు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 3, 4వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని డాన్‌బోస్కో పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి తెలిపారు. గురువారం వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారుల హాజరవుతారని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.



త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు

- ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 134 బస్సులకు ప్రతిపాదనలు
- ఎలక్ట్రికల్ బస్సుల్లో డ్రైవర్లు ప్రైవేట్ వ్యక్తులే
- కేంద్ర విధానాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు

7

● వేంకటేశ్వరుడికి కలశాభిషేకం



మేళ్లచెర్వు: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. గురువారం వేకువజామున 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు.

సుందరం.. సూర్యాస్తమయం



[illegible]

(ఆంధ్రజ్యోతి-[illegible])

8 నుంచి శాపల్లి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

● 13న కల్యాణం, 16న రథోత్సవం, రాత్రి దోపోత్సవం





శాపల్లి ప్రధానాలయ రాజగోపురం, ఆలయంలోని లక్ష్మీనరసింహమూర్తి

నార్కట్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లి కమలాద్రి కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 8 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ అనువంశిక అర్చకులు కారంపూడి నర్సింహాచార్యులు, రాకేశాచార్యుల ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న స్వామి వారి కొండపైకి చేరటం, తొళక్కం, 9న ప్రబంధ పారాయణాలు, 10న హనుమంత సేవ, పరమ పదోత్సవం, 11న రాత్రికి అంకురార్పణ, 12న ధ్వజారోహణ(గరుడముద్ద), 13న కల్యాణోత్సవం, 14న అశ్వవాహన సేవ, 15న బలిహరణం, నిత్య హోమాలు, 16న దివ్య విమాన రథోత్సవం, రాత్రికి దోపోత్సవం, 17న పుష్పయాగం, ఏకాంతసేవ, 18న స్వామివారిని గ్రామంలోని ఆలయంలోకి చేర్చుట శృంగార డోలోత్సవంతో ఉత్సవ పరిసమాప్తి జరగనుంది. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవానికి, దోపోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతారు. బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని రంగులతో అలంకరిస్తున్నారు.

ముగ్గులు చెరిపిన మైనర్లపై కేసు నమోదు

మునగాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ముగ్గులు చెరిపేసిన ఐదుగురు మైనర్లపై కేసు నమోదైంది. డిసెంబరు 31వ తేదీ రాత్రి సూర్యాపేట జిల్లా మునగాలలో ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునగాల మండల కేంద్రానికి చెందిన చిత్తలూరి సీతారం ఇంటి ముందు వేసిన ముగ్గులను డిసెంబరు 31న అర్ధరాత్రి ఐదుగురు మైనర్లు చెరిపేశారు. అంతేకాకుండా ఇంటి ఆవరణలోని విద్యుత్ లైట్లను ధ్వంసం చేశారు. గ్రామంలో చెక్క కిషోర్, అర్వపల్లి ప్రవీణ్, వల్లోజు వెంకన్న, బ్రహ్మదేవర అఖిల్, అద్దంకి రామారావు ఇంటి ముందు చేసిన ముగ్గులను కూడా చెరిపేశారు. ఈ మేరకు 1వ తేదీన చిత్తలూరి సీతారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఐదుగురు మైనర్లలో ముగ్గురు పదో తరగతి చదువుతుండగా, ఇద్దరు ఇంటర్ చదువుతున్నారు. కాగా మైనర్లు ముగ్గులు చెరిపేస్తూ, విద్యుత్ లైట్లు ధ్వంసం చేస్తూ తీసుకున్న వీడియోను స్థానికంగా ఓ వాట్సప్ గ్రూప్‌లో షేర్ చేయటంతో ఆ వీడియో ఆధారంగా కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఐదుగురు మైనర్లను, తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేశామని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఇద్దరు మహిళల పైకి దూసుకెళ్లిన ట్రాక్టర్ : ఒకరి మృతి



చాంద్‌బీ(ఫైల్)

కనగల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలం ఇస్లాం నగర్‌లో ఇద్దరు మహిళల పైకి ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్‌చాంద్‌బీ(54), షేక్‌లాల్‌బీ(50) ఇరువురు మధ్యాహ్నం మసీదుకు వెళ్లే దారిలో మలుపు వద్ద కూర్చున్నారు. అదేసమయంలో గ్రామానికి వస్తున్న ట్రాక్టర్ వీరి మీదుగా దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చాంద్‌బీ మృతి చెందింది. లాల్‌బీకి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చాంద్‌బీ కుమారుడు షేక్‌బడేమియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

తల్లిదండ్రులు మందలించారని బలవన్మరణం

మర్రిగూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివన్నగూడకు చెందిన సుంకరి ఇంద్రయ్య పెద్ద కుమారుడు కుమారుడు గణేష్(16) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పిట్టలగూడెం గురుకుల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నెల రోజులుగా కళాశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. కళాశాలకు ఎందుకు వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించారు. గురువారం ఉదయం గణేష్‌ను తమతో పాటు వ్యవసాయ పొలం వద్ద పత్తి ఏరేందుకు తీసుకెళ్లారు. తల్లిదండ్రులు పత్తి ఏరుతుండగా గుడిసెలో ఉన్న క్రిమిసంహారక మందు తాగాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన తల్లిదండ్రులు కుమారుడిని వెంటనే మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో మార్గమధ్యలో మృతిచెందాడు. గణేష్ తండ్రి ఇంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఫొటోగ్రాఫర్ ...



గోవర్ధన్(ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలతో ఫొటోగ్రాఫర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుడిపల్లి మండలం చిలకమర్రి గ్రామంలో గురువారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం చిలకమర్రి గ్రామానికి చెందిన ఆదాసు గోవర్ధన్(27) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. ఆర్థిక సమస్యలతో డిసెంబరు 31న తన వ్యవసాయ పొలం వద్ద క్రిమిసంహారక మందు తాగి ఇంటికి వచ్చి భార్యకు విషయం చెప్పాడు. దీంతో వెంటనే ఆమె చికిత్స నిమిత్తం గోవర్ధన్‌ను దేవరకొండ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. గోవర్ధన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరణించినా జీవించు..

'సుకవి జీవించే ప్రజల నాల్కలందు' అన్నాడు మహాకవి జాషువా. పరోపకారం చేసిన మనిషి యొక్క మంచితనానికి అతడి మరణానంతరం కూడా ప్రజలో గుర్తింపు లభిస్తుందని రాశాడు. అతను సమాజానికి చేసిన సేవ గురించి భవిష్యత్ తరాలు కూడా చెప్పుకుంటాయని కవి భావన. అయితే మనిషి మరణంతోనే జీవితం ముగిసిపోదు, మరో మనిషి జీవితంలో వెలుగులు నింపుతూ జీవించేలా ఉండొచ్చు అంటున్నారు అవయవదానానికి ముందుకు వచ్చిన దాతలు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

● అవయవ దానంతో ఎందరికో ఆర్తుల జీవితాలకు వెలుగు

● సామాజిక శ్రేయస్సే పరమార్థం

● అవయవదానంపై పెరుగుతున్నఅవగాహన

సమాజ శ్రేయస్సును కాంక్షించి దేహదానం, అవయవదానం గురించి ఆలోచించడం ద్వారా ఆర్తుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్న ఆలోచనలు బలపడుతున్నాయి. కుటుంబీకుల్లో ఎవరైనా నిర్జీవులైతే వారి అవయవాలు దానం చేసేందుకు ఇటీవల సామాజిక స్పృహతో ముందుకు వస్తున్నారు. అదేవిధంగా మరికొందరు తమ మరణానంతరం తమ దేహాన్ని దానం చేస్తూ అంగీకారపత్రం ఇస్తున్నారు. దీని ద్వారా మరణానంతర జీవితాన్ని పొందుతున్నారు. ఇది ఎందరి జీవితాల్లోనో వెలుగులు నింపుతోందని అంటున్నారు.

తోటి వారికి మరో ఉదయం

సహజంగా జన్మించిన జీవి అన్ని అవయవాలు సక్రమంగా ఉంటేనే జీవిత చరమాంకం వరకు దైనందిన కార్యక్రమాలు నిర్వహించుకోవడం, ఆరోగ్యంగా జీవించగలగడం సాధ్యమవుతోంది. కొన్ని సందర్భాల్లో ప్రమాదం కారణంగానో, అనారోగ్యకారణంగానో ఒక అవయవం పనిచేయకపోవడం, లేదా తొలగించడం వల్ల అతడి జీవన పరిస్థితులు దుర్భరమవుతాయి. ఆ వ్యక్తిపై ఆధారపడిన మిగతా కుటుంబసభ్యుల జీవనం భగ్నమయ్యే అవకాశం తలెత్తుతోంది. ఇది సమాజ మనుగడకు శ్రేయస్కరం కాదు. ఆధునిక వైద్యవిజ్ఞానం అభివృద్ధి చెంది సైన్స్ సృష్టికి ప్రతి సృష్టి చేస్తున్నప్పటికీ కృత్రిమ అవయవాలు శరీర బాహ్యఅవయవాలు(కాళ్లు, చేతులు) వరకే పరిమితమయ్యాయి. ఇవి కూడా సహజ అవయవాలలా స్పందన కలిగి ఉండటం లేదు. అవయవ మార్పిడి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత రోగుల జీవితాలకో ప్రయోజనం కలిగింది. అవయవ నష్టంతో బాధపడుతున్న వ్యక్తికి రెండో జీవిత అవకాశాన్ని అందిస్తున్నారు. దీంతో సమాజంలో అవయవ దానం ప్రాముఖ్యం పెరిగింది. కళ్లు, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు, ప్రేగు, కాలేయం లాంటి 37 అవయవాలు దానం చేయడం ద్వారా రోగికి నూతనజీవితాన్ని ప్రసాదించవచ్చు.

సజీవ/ నిర్జీవ దాతలు

బతికుండగానే రోగికి ఉన్న అనుబంధం మేరకు అవయవదానం చేసేవారు ఉన్నారు. లేదా మరణానంతరం, లేదా బ్రెయిన్‌డెత్ రోగుల అవయవాలను సేకరించవచ్చు. ఏఎల్ఎస్(ఆర్టిఫీషియల్ లైఫ్ సపోర్ట్) ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్, ఆక్సిజన్ అందించడం ద్వారా మరణం తరువాత 36-72 గంటలు అవయవాలు పనిచేస్తాయి.



అవయవదానం- దేహదానం చేయండి

ఎంతో విలువైన దేహాలను మట్టి పాలు, మంట పాలు చేయకుండా వాటిని దానం ఇవ్వడం వల్ల సమాజానికి ఎంతో మేలు కలుగుతుందని ప్రచారం సాగిస్తున్నారు మిర్యాలగూడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ కొండల్‌రెడ్డి(జేకేఆర్). ఆయన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు. కరపత్రాల ద్వారా అవయవ దానం, దేహదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. సాంప్రదాయాల పేర మృతదేహాలను కాల్చడం, పూడ్చడం కంటే ప్రజల కోసం పనిచేసే వైద్య కళాశాలలకు దానంగా ఇవ్వడం వల్ల వైద్యవిద్యార్థులు మానవ శరీర నిర్మాణం గూర్చి తెలుసుకుని ఆరోగ్య సమాజం కోసం కృషి చేస్తారని వివరిస్తున్నారు. అవయవాలు పాడైన వారికి అవయవ మార్పిడి చేయడం వల్ల కొత్త జీవితాన్ని ఇవ్వగలమని మరణం తరువాత ఇది మరో జన్మ లాంటిదని అన్ని సందర్భాలలోనూ ప్రజలకు వివరిస్తూ వస్తున్నారు. మరణానంతరం తన దేహాన్ని మెడికల్ కళాశాలకు దానం ఇవ్వడమే కాకుండా నిరక్షరాస్యురాలైన తన భార్య పూలమ్మను కూడా దేహదానం చేయడానికి అంగీకరింపజేశారు. ఈ మేరకు ఇరువురు అవయవదాన ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ వారికి కాన్సెంట్ లెటర్(అంగీకారపత్రాన్ని) ఇచ్చారు.



కొండల్‌రెడ్డి దంపతులు మెడికల్ కళాశాలకు దేహదానం చేసేందుకు ఇచ్చిన అంగీకారపత్రం

మిర్యాలగూడలో అవయవదాతలు

మాజీ శాసనసభ్యులు నంద్యాల శ్రీనివాసరెడ్డి, మానవహక్కుల నేత సుబ్బారావు భార్య సత్యవతి, కుమారుడు శరత్, రవీందర్‌రెడ్డి కుమారుడు అచ్యుత్ మల్లు స్వరాజ్యం, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి తండ్రి లింగారెడ్డి, చవ్వా రాంరెడ్డి. ఆర్వీ ప్రసాద్ ఇలా ఎందరో తమ శరీరాలను, అవయవాలను, కళ్లను దానం చేశారు.

అవయవదానంపై అవగాహన పెరుగుతోంది

ప్రజల్లో అవయవదానంపై అవగాహన పెరుగుతోంది. ఐదేళ్లలో 285 కళ్లు, నలుగురు బ్రెయిన్‌డెత్ వారి అవయవాలు, రెండు కిడ్నీ దానాలు, మెడికల్ కళాశాలకు మృతదేహాన్ని దానంగా ఇచ్చారు.

విజయ్‌భాస్కర్, అవయవ దానం సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయాలి

తమ మరణానంతరం అవయవదానం చేసిన దాతల భౌతికదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలి. అనేకానేక ఆచారాలు, సంప్రదాయాలు పాటించే సమాజంలో వాటిని కాదని, సమాజం కోసం దేహాన్ని వైద్యవిద్యార్థుల కోసం ఇవ్వడం గొప్ప మానవీయ లక్షణం. వారి స్ఫూర్తిని మరికొందరికి అందించేందుకు ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు జరపాలి. మరణ శరీరాన్ని ఇచ్చిన పేద కుటుంబానికి ప్రభుత్వం పథకమేదైనా వర్తించేలా చూడాలి.



వేనేపల్లి పాండురంగారావు, మట్టిమనుషుల వేదిక కన్వీనర్

దేహదానంతో వైద్యశాస్త్రానికి చేయూత

విద్యను అభ్యసించేటప్పుడు పుస్తకాలు ఎంత అవసరమో వైద్యవిజ్ఞానం సమకూర్చుకునేందుకు మానవదేహాలు అంతే అవసరం. ఆరోగ్య సమాజాన్ని నిర్మించేందుకు మెడికల్ విద్యార్థుల డిసెక్షన్ కోసం దేహదానం చేయాలి. ఎంతో విలువైన దేహాన్ని మట్టిలో పాతకుండా, కట్టెల్లో కాల్చకుండా అవయవాలు నష్టపోయిన వారికోసం, శాస్త్రీయ పరిశోధన కోసం ఇవ్వాలి.



జే కొండల్‌రెడ్డి, జనవిజ్ఞాన రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కారుణ్య మరణానికి అనుమతించండి

పెద్దవూర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తనకు న్యాయం చేయడంలేదని, కారుణ్యమరణానికి అవకాశం కల్పించాలని ఓ మహిళ నిరసన వ్యక్తం చేసింది. నల్లగొండ జిల్లా పెద్దవూర తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ప్లకార్డుతో ఆందోళన వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం మొసం గ్రామానికి చెందిన బొంగరాల వెంకటమ్మ 2008లో నిరసనమెట్ల రాములమ్మ వద్ద పెద్దవూర మండలం కొత్తలూరు రెవెన్యూ శివారులోని సర్వే నెంబరు 97ఊలోని రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంది. 2010లో పాస్‌బుక్ వచ్చింది. 2020 వరకు వెంకటమ్మే కబ్జాలో ఉండి సేద్యం చేసుకుంది. కాగా గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల తమ పేరు మీద ఉన్న రెండు ఎకరాలు నలుగురి పేరు మీద నమోదయ్యాయని తెలిపింది. అందులో ఇద్దరు ఆ భూమిని మరొకరికి విక్రయించారన్నారు. సమస్యను పరిష్కరించాలని రెండేళ్ల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదని, ఇటీవల ఆర్ఐ వచ్చి పంచనామా చేసి రిపోర్ట్ ఇచ్చినా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని ఆరోపించింది. ఆన్‌లైన్‌లో ఎవరైతే నమోదులో ఉంటారో వారికి మేం మద్దతు తెలుపుతామని అంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని లేదా కారుణ్య మరణానికి అనుమతించాలని సదరు మహిళ, ఆమె ఇద్దరు కుమారులు శివ, శ్రీకాంత్‌లతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసింది. అరగంట అనంతరం వెంకటమ్మ, ఆమె కుమారులు ఆందోళన విరమించారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వెంకటమ్మ, కుటుంబ సభ్యులు

'ప్రత్యేక' దర్శనాలు షురూ

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రద్దీ వేళల్లో వృద్ధులు, చంటిపిల్లల తల్లులు, దివ్యాంగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో వీరిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. స్వామివారి దర్శనానికి విచ్చేసే అందరూ భక్తులు కూడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టింది. వృద్ధులు, చంటిపిల్లల తల్లులు, దివ్యాంగుల కోసం బ్రేక్ దర్శనం తరహాలో ఉదయం 11గంటల నుంచి 11.30 గంటల వరకు, సాయంత్రం 5నుంచి 5.30 గంటల వరకు దర్శనాలు కల్పిస్తున్నారు. జనవరి 1వ తేదీ నుంచి ఆలయ పాలక మండలి ఈ సమయాల్లో దర్శనాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. వీరిని ప్రత్యేక క్యూలైన్‌లో తీసుకెళ్లి స్వామివారి దర్శనం చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తద్వారా ఇకపై గుట్టలో వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లులకు స్వామివారి దర్శనాలు సులువు కానున్నాయి. భక్తుల మధ్య నుంచి వెళ్లి పడే ఇక్కట్లు తప్పనున్నాయి.

ముమ్మరంగా స్వర్ణతాపడం పనులు

స్వామివారి గర్భగుడి విమాన గోపురం స్వర్ణ తాపడంతో చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 60కిలోల బంగారం అవసరమవుతుందని అంచనా వేసింది. ఈ మేరకు పనులు ప్రారంభించింది. విమనాగోపురానికి బంగారం తాపడం చేసిన విగ్రహాలను అమర్చుతున్నారు. అధికారులు వారానికోసారి ఈ పనులపై సమీక్ష నిర్వహిస్తున్నారు. 1000 చదరపు అడుగులు ఉన్న పనులు ఇప్పటివరకు దాదాపుగా 3వేల అడుగల వరకు పూర్తయినట్టుగా సమాచారం. మార్చి మొదటివారంలో స్వామివారి బ్రహ్మోత్సవాలలోపు పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఫిబ్రవరి ఆఖరివారంలో పనులు పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి 23వ తేదీన విమానగోపురానికి సంప్రోక్షణ పూజలు చేపట్టనున్నట్టు సమాచారం. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆహ్వానించనున్నారు. సీఎం, పలువురు రాష్ట్ర మంత్రుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రాలతో సంప్రోక్షణ పూజలు ఘనంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు విమనగోపురం స్వర్ణతాపడం పనులకు విరాళాలు సేకరించేందుకు ప్రచారం చేపడుతున్నారు.

వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక దర్శనాలు



స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. సెలవు దినాల్లో పెద్దఎత్తున భక్తులు తరలివస్తున్నారు. భక్తుల రద్దీ ఉండంతో వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపైన ప్రధాన ఆలయం తూర్పు ద్వారం ముందు ఏడు అడుగుల గేట్‌తో కూడిన గ్రిల్స్ ఏర్పాటు చేశాం. తూర్పు ద్వారం ముందు వీరు కూర్చునేందుకు కుర్చీలు అందుబాటులోకి తెచ్చాం. వీరి కోసం ప్రతిరోజు ఉదయం 11 నుంచి11.30గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 5.30వరకు ప్రత్యేక దర్శనాల అవకాశం కల్పిస్తున్నాం. స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.

భాస్కర్‌రావు, ఆలయ ఈవో

నాగార్జునకొండను సందర్శించిన బౌద్ధపరిశోధకులు



విదేశీ బౌద్ధ పరిశోధకులకు చారిత్రక విశేషాలను వివరిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

నాగార్జునసాగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌లోని నాగార్జున కొండను విదేశీ బౌద్ధపరిశోధకులు గురువారం సందర్శించారు. తైవాన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, హాంకాంగ్ దేశాలకు చెందిన బౌద్ధ పరిశోధకులు బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించగా బుద్ధవనం కన్సల్టెంట్, ప్లీచ్ ఇండియా సీఈవో, పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి వారికి చారిత్రక విశేషాలను వివరించారు. నాగార్జునకొండ తవ్వకాలు సమయంలో మ్యూ జియం నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆమోదించిన విష యంలో అప్పటి పురావస్తు అధికారి సుబ్రహ్మణ్యం కృషిని బౌద్ధపరిశోధకులకు మ్యూజియం అధికారి కమల్ హాసన్ వివరించారు. సందర్శించిన వారిలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ప్రొఫెసర్లు సారా, జాఫ్రి షాలతో పాటు మరో ముగ్గురు బౌద్ధ పరిశోధకుల ఉన్నారు.

సీఎం, మంత్రులకు శుభాకాంక్షల వెల్లువ



సీఎంతో ఎమ్మెల్యే అయిలయ్య

ఆలేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఇతర మంత్రులకు ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు. ఈసందర్భంగా సీఎంకు లక్ష్మీ నరసింహస్వామి లడ్డు ప్రసాదాన్నివేసి అందజేసి పూలమాల శాలువాతో సన్మానించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శాసనసభ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బీర్ల అయిలయ్య కలిసి వారికి పూలబొకే బహూకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు. ఆలేరు అభివృద్ధి సంపూర్ణంగా సహకరించాలని అభ్యర్థించారు.



సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న రమేష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దరావత్ వెంకన్ననాయక్ ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురం: కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జక్కలి ఐలయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీఎం నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్క. జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

బర్ధన్ ఆశయ సాధనకు కృషి చేయాలి :సీపీఐ

దేవరకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి దివంగత బర్ధన్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో బర్ధన్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. చివరిశ్వాస వరకు ప్రజా సమస్యలపై పోరాటం నిర్వహించిన మహాయోధుడు బర్ధన్ అని ఆయన గుర్తు చేశారు. బర్ధన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సీపీఐ నాయకులు, కార్యకర్తలు పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, పల్లా రంగారెడ్డి, జూలూరి వెంకట్రాములు పాల్గొన్నారు.

దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితుడు, కుటుంబ సభ్యులు

నూతన్‌కల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తనపై అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని మండల కేంద్రానికి కాటూరి రాము కోరారు. పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులతో కలసి గురువారం నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఎస్ఐ, కానిస్టేబుళ్లు తీవ్రంగా కొట్టడంతో తన చిటికెన వేలు విరగడంతో పాటు . రెండు చేతులకు తీవ్రమైన గాయాలయ్యాయని అన్నాడు. పోలీసులను సస్పెండ్ చేసి, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాడు. తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ ఘటనా స్థలానికి చేరుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని హామీ ఇవ్వడంతో అందోళన విరమించాడు.

త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు

● ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 134 బస్సులకు ప్రతిపాదనలు ● ఎలక్ట్రికల్ బస్సుల్లో డ్రైవర్లు ప్రైవేట్ వ్యక్తులే ● కేంద్ర విధానాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు

పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఎలక్ట్రికల్ బస్సులను నడిపించడం కోసం కసరత్తు ముమ్మరం చేసింది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 134 కొత్త విద్యుత్ బస్సులను మంజూరు చేయాలని అధికారులు ప్రతి పాదనలు సిద్ధం చేశారు. ఇవి త్వరలో ఉమ్మడి జిల్లాకు రానున్నాయి. (నల్లగొండ -ఆంధ్రజ్యోతి)



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే కార్లు, టూ వీలర్లు ఇతర వాహనాలను ఎలక్ట్రికల్ రంగం వైపు ప్రోత్సహిస్తున్న ఆయా కంపెనీలకు, వాహన వినియోగదారులకు వాహనాల ట్యాక్సీతో పాటు ఇతర అంశాల్లో సడలింపులు కలిపిస్తూ ప్రోత్సాహం ఇస్తున్న విషయం తెలిసిందే. ఇక కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో ఆర్టీసీలో ఎలక్ట్రికల్ బస్సులను ఇప్పటికే ప్రవేశపెట్టి విజయవంతంగా నడిపిస్తున్నారు. వరంగల్ జిల్లాలో కూడా బస్సులను త్వరలో ప్రారం భించనున్నారు. తాజాగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 134 కొత్త విద్యుత్ బస్సులను మంజూరు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఈ బస్సులు ఉమ్మడి జిల్లాలో తిరగాల్సి ఉన్నప్పటికీ చార్జింగ్ పాయింట్ లేకపోవడంతో మరో మూడు నెలలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. మొదటి విడతలో నల్లగొండ జిల్లాకు 72 బస్సులు, సూర్యాపేట జిల్లాకు 62 బస్సులను మంజూరు చేయనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు విద్యుత్ బస్సుల కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ బస్సుల సంఖ్య ఏ మేరకు ఉండాల్సిన దానిపై ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

చార్జింగ్‌కు నల్లగొండ డిపోలో 33/11 కేవీ లైన్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో త్వరలో తిరిగే ఎలక్ట్రికల్ బస్సుల కోసం నల్లగొండ డిపోలో 33/11కెవీ లైన్‌ను త్వరలో నిర్మించనున్నారు. సుమారు రూ.6 కోట్లతో ఖర్చుఅయ్యే ఈ మినీ లైన్‌కు త్వరలోనే టెండర్లను ఖరారు చేసి పనులను ప్రారంభించనున్నారు. విద్యుత్ శాఖ పనులను త్వరగా పూర్తిచేస్తే ఎలక్ట్రికల్ బస్సులు జిల్లాకు రానున్నాయి. చార్జింగ్ పాయింట్‌గా నల్లగొండ డిపోలో ఈ మినీ విద్యుత్ లైన్‌తో పాటు సబ్‌స్టేషన్‌ను నిర్మించినట్లయితే బస్సులు చార్జింగ్ చేసుకోవడానికి వీలుంటుంది. ఇందుకు మరో మూడు నెలలు సమయం పట్టనున్నట్లు సమాచారం. ఎలక్ట్రికల్ బస్సులు చార్జింగ్ కోసం స్విచ్, విద్యుత్ బోర్డుల్లో ఈ చార్జింగ్ పాయింట్లకు విద్యుత్‌ను ఓవర్ లోడ్ లేకుండా సమానంగా విద్యుత్‌ను సరఫరా చేసేలా నిర్మాణం జరగనుంది. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీతో పాటు ముంబయిలో వేలాది ఎలక్ట్రికల్ బస్సులు నడిచేలా పలు రాయితీలతో ప్రోత్సాహకాలను అందిస్తూ ఎలకి కల్ బస్సులను నడిపిస్తోంది. దానిని ఆదర్శంగా తీసుకొని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కూడా పెద్ద ఎత్తున బస్సులను నడపించి ప్రయాణికులకు సౌక ర్యం కల్పించాలని నిర్ణయించారు. అయితే ఇందులో అత్యధికంగా డీలక్స్ బస్సులు ఉంటాయా లేక ఉచిత ప్రయాణం నేపథ్యంలో మహిళలకు ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా ఎలక్ట్రికల్ బస్సులను ఏర్పాటు చేస్తారా వేచి చూడాల్సి ఉంది.

ఈ నెల 6న సదస్సు

ఆర్టీసీలోకి ఎలక్ట్రికల్ బస్సులు రానున్న నేపథ్యంలో ఈనెల 6న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యుత్ బస్సులు- ప్రజలు- ఆర్టీసీ పై ప్రభావం అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహిస్తున్నారు. కేంద్రం పర్యావరణ పరిరక్షణ పేరుతో దేశంలో విద్యుత్ బస్సులను తీసుకరావడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఆర్టీసీ విద్యుత్ బస్సులను కొని నిర్వహించాలని పేర్కొంటున్నారు. కేంద్రం నిర్ణయం వల్ల ఉద్యోగ భద్రత ప్రమా దంలో పడుతుందనిఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

అద్దె బస్సుల మాదిరిగానే ..

ఆర్టీసీ సంస్థ ప్రస్తుతం అద్దె బస్సులను అద్దె ప్రాతిపాదికన తీసుకొని రీజియన్‌లో నడుపు తున్న మాదిరిగానే ఎలక్ట్రికల్ బస్సులను కూడా అద్దె ప్రాతి పాదికన తీసుకోనున్నారు. ఆర్టీసీ సంస్థతో పాటు ప్రభుత్వం సైతం పెట్టుబడులు పెట్టి బస్సులను కొనుగోలు చేసే పరిస్థితి లేక పోవడంతో ఎలక్ట్రికల్ బస్సులను తయారు చేసే కంపెనీలకు అద్దె చెల్లించి బస్సులను తీసుకోనున్నాయి. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ రీయి ంబర్స్ మెంట్ ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుంది. ఆర్టీసీ లోకి అద్దె బస్సులు వస్తే ఎలక్ట్రికల్ బస్సులను తయారు చేసే కంపెనీల నిర్వాహకులకు సంబంధించిన డ్రైవర్లే ఆ బస్సులను నడుపుతారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి ఉద్యోగ భద్రతపై పలు అనుమానాలు వ్య క్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుకు సంబంధించి ఒక్కొక్క బస్సు కొనుగోలుకు రూ.కోటిన్నర వరకు వెచ్చించాల్సి ఉంటుంది. దీంతో అద్దె ప్రాతిపాదికన ఎలక్ట్రికల్ బస్సులు తీసుకోవడమే ప్రయోజనమని సంస్థ భావిస్తుంది. డ్రైవర్లకు జీతాలు ఇవ్వడం, కొత్త ఉద్యోగాలు సృష్టించడం కంటే ఎలక్ట్రికల్ బస్సులు నిర్వాహకులకే డ్రైవర్ల బాధ్యత ఇవ్వాలని ప్రభుత్వం, సంస్థ యోచిస్తుంది. దీంతో ఆర్టీసీ ఉద్యో గులు, సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు నడిపిస్తాం



పర్యావరణ పరిరక్షణకు తీసుకవస్తున్న ఎలక్ట్రికల్ బస్సు లను త్వరలో ఉమ్మడి జిల్లాలో నడిపిస్తాం. తొలుత నల్లగొండ, సూర్యాపేట జిల్లాకు ఎలక్ట్రి కల్ బస్సులు మంజూరు కానున్నాయి. సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఆయా రూట్లల్లో బస్సులను నడిపిస్తాం. నల్లగొండ డిపోలో చార్జింగ్ పాయింట్ కోసం 33/11కెవీ సబ్ స్టేషన్ నిర్మిస్తున్నాం. త్వరలో టెండర్లు కూడా ఖరారు కానున్నాయి. -కె.జాన్‌రెడ్డి, ఆర్టీసీ, ఆర్ఎం

ఫటాఫట్ FATAFAT

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

● వేములపల్లి మండల వ్యవసాయాధికారి రుషేంద్రమణి



సాగులో వ్యవసాయాధికారుల సూచనలతో సరైన సమయంలో సస్యరక్షణ చర్యలను చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించ వచ్చని వేములపల్లి మండల వ్యవసా యాధికారి రుషేంద్రమణి సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. (వేములపల్లి -ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి : యాసంగిలో కాలిబాటలు ఏ దిక్కులో ఏర్పాటు చేసుకోవాలి ?

ఏవో: యాసంగి వరి సాగులో తూర్పు, పడమర దిక్కుల్లో కాలిబాటలు తీసుకోవాలి. ప్రతి 2 మీటర్ల వరి పొలానికి 20 సెంటిమీటర్ల దూరం వదులుతూ కాలిబాటలు తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : కాలిబాటలతో ఎలాంటి ప్రయోజనం ఉంటుంది

ఏవో: వరి సాగుకు గాలి, వెలుతురు అంది చీడపీడలను నివారించుకోవచ్చు. ఎరువులను, మందులను పిచికారీకి ఉపయోగపడు తాయి.

ఆంధ్రజ్యోతి : కలుపు నివారణకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలి? నాటు వేసిన ఎన్ని రోజులకు కలుపు మందు చల్లాలి?

ఏవో: వరినాటిన తరువాత మొదటి మూడు మొదటి మూడు నుంచి ఐదు రోజుల్లోపు అధికారుల సూచనల మేరకు సరైన కలుపు మందులు వేయడం ద్వారా కలుపును నివారించుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి : ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా వరి సాగులో ఏ విధమైన చర్యలు తీసుకోవాలి

ఏవో: యాసంగి వరిసాగులో ప్రధానంగా జింకు లోపం ఉంటుంది. దీని నివారణకు 25 కిలోల పొటాష్ దుక్కుల్లో వేసుకోవాలి. దాంతోపాటు జింకు లోపం నివారణకు ఎకరాకు జింకు సల్ఫేట్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలి.

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

● పాతగుట్టలో సంప్రదాయరీతిలో నిత్యకల్యాణం



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో నిత్య కైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైడూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠంపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణవంతు నిర్వహించారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామి అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రవహనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా రూ. 17,45,496 ఆదాయం ఆలయ ఖజానాకు సమకూరిందని ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా ఆలయంలో వేకువజామున ధనుర్మా సోత్సవాలు 18వ రోజు వైభవంగా కొనసాగాయి.

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ కెప్టెన్‌గా విజయ్‌కుమార్

● చెన్నైలో ఆడనున్న యువకుడు



విజయ్‌కుమార్

చిట్యాల రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ మెన్స్ టోర్నమెంట్ కెప్టెన్‌గా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన యువకుడు ఎంపికయ్యాడు. గ్రామీణ ప్రాంతంలో విద్యనభ్యసించి క్రీడారంగంపై మక్కువతో హాకీలో శిక్షణ పొందాడు. చిన్నప్పటి నుంచి స్వగ్రామంలోనే విద్యాభ్యాసం చేసి 10వ తరగతి జడ్పీహెచ్ ఎస్‌లో పూర్తి చేశారు. 6వ తరగతిలో ఉన్న సమయంలోనే హాకీపై మక్కువను పెంచుకున్నాడు. ఇంటర్మీ డియట్‌ను రామన్నపేట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) పూర్తి చేశాడు. ఇంటర్ చదివే సమయంలో హాకీలో ఉత్తమ ప్రతిభను కనబర్చి వనపర్తి జిల్లాలో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అకాడమికి ఎంపికైనాడు. అక్కడే శిక్షణ తీసుకుంటూ ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాడు. ప్రస్తుతం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని డాక్టర్ ఎంఎంఆర్‌సిపి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందుతున్నాడు. విజయ్‌కుమార్ ప్రతిభను గుర్తించి మహాత్మాగాంధీ యూనివర్సిటీ హాకీ మెన్స్ టోర్నమెంటు2024-25కు కెప్టెన్‌గా నియమించారు. సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ తరఫున చెన్నైలోని మేయర్ రాధాకష్ణన్ హాకీ స్టేడియంలో ఈనెల 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు జరుగనున్న హాకీ టోర్నమెంటుకు విజయ్‌కుమార్ కెప్టెన్‌గా వ్యవహరించ నున్నాడు. హాకీ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కెప్టెన్‌గా ఎంపికై చెన్నైలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొననున్న విజయకుమార్‌ను తల్లి, గ్రామస్థులు, సన్నిహితులు, బంధువులు అభినందించారు.

కొనుగోలు చేస్తామని పిలిచి.. పొమ్మన్నారు

● ట్రాక్టర్లు రోడ్డుకు అడ్డుపెట్టి పత్తి రైతుల రాస్తారోకో



కాటన్ మిల్లు ఎదుట రోడ్డుకు ఇరువైపుల నిలిచిన పత్తి ట్రాక్టర్లు

చండూరురూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు చేస్తామని ప్రకటించి ఆ తర్వాత వెళ్లగొట్టారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఈ మేరకు రహదారిపై ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి ఆందోళన చేశారు. చండూరు మండలం బంగారిగడ్డ మంజిత్ కాటన్ మిల్లు వద్ద ఈ సంఘటన జరిగింది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1వ తేదీన ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ఆ ఒక్క రోజు పత్తి కొనుగోళ్లు నిలిపివేసి, తిరిగి 2వ తేదీన కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు కాటన్ మిల్లు వద్ద నోటీసులు అంటించారు. దీంతో గురువారం ఉదయం బంగారిగడ్డలోని పత్తి మిల్లుకు ట్రాక్టర్లు, ఆటోల ద్వారా సుమారు 80 వాహనాల్లో రైతులు పత్తిని మిల్లుకు తీసుకొచ్చారు. గత ఏడాది డిసెంబరు 31వ తేదీన మిల్లులో అగ్ని ప్రమాదం జరిగిందని, చిన్న చిన్న మరమ్మతులు చేస్తున్నామని, అందులో పనిచేసే ఆపరేటర్‌కు గాయాలు అయ్యాయని మిల్లు యజమానులు మిల్లు ఎదుట నోటీసు అంటించారు. కొన్ని రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని గురువారం ఉదయం మిల్లు ఎదుట నోటీసు అంటించడంతో అప్పటికే పత్తి తెచ్చిన రైతులు అయోమయానికి గురయ్యారు. తాము దూర ప్రాంతాల నుంచి వాహనాలపై పత్తి తీసుకొస్తే కొనుగోలు చేయకపోవడం ఏమిటని ఆగ్రహిస్తూ రైతులు మిల్లు ఎదుట రోడ్డుపై రాస్తారోకో చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు రైతుల వద్దకు చేరుకుని సీసీఐ అధికారులతో మాట్లాడారు. గురువారం పత్తి కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు జిల్ల రాజీవ్, కావలి ప్రసాద్, ఇడికూడ వెంకన్న, అడివి భిక్షమయ్య, ముత్తయ్య, మహ్మద్ మాజిద్, బొమ్మరగోని నగేష్, మాలె రవీందర్‌రెడ్డి, అంజి, రాములు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ భయపెడుతున్న ఫ్లోరైడ్

(5వ పేజీ తరువాయి)

యాదాద్రి, నల్లగొండ జిల్లాల్లోని భూగర్భజలాల్లో ప్రమాణాలకు మించి రసాయనాలు, కాలుష్యాలు, రోగకారక మూలకాల శాతం ఎక్కువయిందని తాజా నివేదిక స్పష్టం చేసింది. నీటిలో లవణాల శాతం యాదాద్రి జిల్లాలో 2.96శాతం వరకు పెరిగినట్టు నిర్ధారించారు. లవణీయతను నిర్ధారించే ఎలక్ట్రోకండక్టివిటీ 3000 పాయింట్లకు లోపు ఉండాల్సి ఉండగా, నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో స్వల్పంగా పెరుగుదల కనిపించింది. ప్రధానంగా భూగర్భజలాలు అత్యధికంగా వినియోగించే యాదాద్రి జిల్లాతో పాటు, నల్లగొండలోని ఎగువ ప్రాంతాల్లో ఈ పరిస్థితి నమోదైంది. అదేవిధంగా నీటిలో నైట్రేట్స్ 45ఎంజీ/లీటర్ ఉండాల్సి ఉండగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంత కంటే ఎక్కువగా నమోదైంది. దీంతో పిల్లల్లో ఎదుగుదల లోపించడం, వ్యాధులు సోకడం, జీర్ణశక్తి తగ్గడం, రోగనిరోధకశక్తి తగ్గడం వంటి లక్షణాలు కన్పి స్తున్నారు. ఈ ప్రభావం పశువులకు మరింత తీవ్రంగా ఉంటుంది. అనివార్యంగా పశువులు ఈ నీటినే తాగుతున్నందున వాటికి రోగాలు ఎక్కువగా వస్తున్నాయని పశువైద్యులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,150 శాంపిళ్లు తీసుకొని నైట్రేట్ పరీక్షల నిర్వహించగా, అందులో దాదాపు 28శాతం శాంపిళ్లలో నైట్రేట్ శాతం ఎక్కువగా నమోదైంది.



మర్రిగూడలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దీంతో పాటు నీటిలో ఇనుముశాతం కూడా ఉండాల్సిన దానికంటే ఎక్కువగా ఉంది. సాధారణంగా లీటర్ నీటిలో 0.01 మిల్లీగ్రామ్ మాత్రమే ఇనుము ఉండాల్సి ఉండగా, నల్లగొండ జిల్లాలో ఇది ఎక్కువగా నమోదైంది. వీటితో పాటు క్యాన్సర్, మూత్రపిండ రోగాలకు దారితీసే ఆర్సనిక్ పరిమాణం కూడా భూగర్భజలాల్లో ఉండాల్సినదానికంటే ఎక్కువగా ఉంది. ప్రధానంగా నీటిలో 0.01ఎంజీ /లీటర్ ఉండాల్సి ఉండగా, నల్లగొండ జిల్లాలో 0.05కి మించి నమోదైంది. వీటితో పాటు భూగర్భజలాలు సాగునీటికి సురక్షితంగా ఉపయోగించాలంటే, నీటిలో ఆర్ఎస్‌సీ (రెసిడ్యూల్ సోడియం కార్బనేట్) శాతం 1.25మిల్లీగ్రామ్/లీటర్, అయితే 2.50 వరకు కొంతమేర పంటలు తట్టుకోగలుగుతాయి. అంతకు మించి నీటిలో ఆర్ఎస్‌సీ ఉంటే పంటల ఉత్పత్తిలో నాణ్యత లోపించడం, నిల్వ సామర్థ్యం లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం భూగర్భజలాల్లో 81శాతం మేర ఆర్ఎస్‌పీ 1.25శాతముంటే, మరో 9శాతం మేర రమారమిగా నమోదైంది. 10శాతం నీటిలో మాత్రం ఈ శాతం అధికంగా నమోదవడం ప్రమాదకర స్థితిని తెలియజేస్తోంది.

పూర్తయిన ఫ్లోరోసిస్ ఇంటింటి సర్వే

నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ బాధిత ప్రాంతమైన మర్రిగూడలో ప్రస్తుతం ఫ్లోరోసిస్ పరిస్థితి ఎలా ఉందనే అంశంపై వైద్య, ఆరోగ్యశాఖ ఇటీవల ఇంటింటి సర్వే నిర్వహించింది. మండలంలో 10,124 కుటుంబాల్లో 34,202 మందిని స్ర్కీనింగ్ చేశారు. అందులో 171 మంది గర్భిణులను స్ర్కీనింగ్ చేశారు. గర్భిణుల యూరిన్ శాంపిల్స్ సైతం సేకరించారు. దంతాల ఫ్లోరోసిస్‌పై గ్రేడ్-1 కింద 1,708 మందిని, గ్రేడ్-2 కింద 1,481 మందిని, గ్రేడ్-3 కింద 908 మందిని స్ర్కీనింగ్ చేశారు. గ్రామాల వారీగా, హ్యాబిటేషన్ల వారీగా ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీటి శాంపిళ్లు సేకరించి పరీక్షలకు ప్రయోగశాలకు పంపారు. ఈ శాంపిళ్ల రిపోర్ట్ రావాల్సి ఉంది. అయితే గతంలో ఉన్న ఫ్లోరోసిస్ బాధిత కుటుంబాల్లో, పాత ఫ్లోరోసిస్ బాధితులకే లక్షణాలు కనిపించాయని, అదనంగా ఎవ్వరికీ లక్షణాలు లేవని ప్రాథమికంగా చెబుతున్న వైద్యులు చెబుతన్నా, పూర్తి నివేదిక వస్తేనే వాస్తవ పరిస్థితి తెలియనున్నాయి.

వ్యర్థాల కుప్ప.. బతుకమ్మ కుంట

● నీళ్లల్లో కోళ్ల వ్యర్థాలు, చెత్త చెదారం ● కంపు కొడుతున్న వల్లభరావు చెరువు ● రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు



బతుకమ్మ కుంట చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

నల్లగొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదం పంచాల్సిన నల్లగొండ పట్టణంలోని వల్లభరావు చెరువు(బతుకమ్మ కుంట) చెత్తకుప్పగా మారుతోంది. కోళ్ల వ్యర్థాలు, చెత్త చెదారం, పాత బట్టలు, చెరుకు గడల చెత్తతో నిండిపోతోంది. చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులకు 2022 సంవత్సరం ఏప్రిల్ 5వ తేదీన శంకుస్థాపన చేశారు. సుమారు రూ.2.50కోట్లతో చేపట్టాల్సిన పనులకు అనేక ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మొదట మంజూరైన నిధులతో రేలింగ్ నిర్మాణం జరగగా, రెండోసారి చేపట్టిన పనులతో సీసీరోడ్డు, ఆర్చి, గేట్ అమర్చిన తర్వాత కాంట్రాక్టర్ తర్వాత వదిలేశాడు. ప్రస్తుతం చెరువు సుందరీకరణ సంగతేమో కాని వ్యర్థాల కంపుతో చెరువు కట్టపై నుంచి వెళ్లే వారికి, వాకర్స్‌కు ఇబ్బందిగా మారింది. కరోనా సమయంలో బతుకమ్మ కుంట చెరువుపైనే అత్యధికంగా ప్రజలు వాకింగ్ చేయగా ప్రస్తుతం కూడా కట్టను వాకర్స్ వినియోగించుకుంటున్నారు. చెరువులో నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందిగా మారడంతో కొంతమంది వాకింగ్ మానేశారు.

శుభ్రం చేసినా.. అదే పరిస్థితి

ప్రతి ఏడాది బతుకమ్మ పండుగ సందర్భంగా అందంగా పేర్చిన బతుకమ్మలను ఈ కుంటలోనే నిమజ్జనం చేస్తారు. నవరాత్రి పూజలు అందుకున్న అనంతరం వినాయక విగ్రహాలను, దుర్గమాత పూజల తర్వాత విగ్రహాలను కూడా ఈ చెరువులోనే నిమజ్జనం చేస్తారు. అనంతరం మునిసిపల్ సిబ్బంది చెరువును శుభ్రం చేస్తారు. ప్రస్తుతం అక్కడ పాత దుస్తులు, కుండలను, కోళ్ల దుకాణాల నుంచి వ్యర్థాలను, చెత్త చెదారం పడేస్తున్నారు. ఇంకా చెరువు పరిసర ప్రాంతాల్లో కూడా శుభ్రం చేసిన పరిస్థితులు లేవు. కుటుంబసభ్యులతో కలిసి సాయంత్రం వేళ కాసేపు బతుకమ్మ కుంట వద్ద సేద తీరాలని భావించి వెళితే చెరువు కట్ట ప్రాంతంలో దుర్గంధం వస్తుండడంతో అక్కడ కాసేపు కూడా ఉండలేక తిరిగి వెళ్తున్నారు. చెరువు నీటిలో గుర్రపు డెక్కతో పాటు అనేక పిచ్చి మొక్కల తీగలతో నిండిపోయింది. ఆ తీగను కూడా తొలగించడానికి సిబ్బంది ముందుకు రావడం లేదు. రాత్రిపూట కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మద్యం సీసాలను పగుల గొట్టి కట్టపై వేస్తుండడంతో అక్కడి నుంచి పాదాచారులకు ఇబ్బందిగా మారుతుంది. చెరువు కట్టపై ఒక భారీ వాహనం నిరంతరం పార్కింగ్ చేసి ఉండడంతో రాకపోకలకు అంతరాయ కలుగుతోంది.



బతుకమ్మ కుంట చెరువులో చెత్తా చెదారం

వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా చూడాలి



ఎంతో ఆహ్లాదకరంగా ఉండాల్సిన వాతావరణం నీటిలో వేస్తున్న వ్యర్థాలతో ఇబ్బందిగా మారుతోంది. అధికారులు స్పందించి చెత్త చెదారాన్ని తొలగించాలి. ఎక్కడి నుంచో తీసుకొస్తున్న వ్యర్థాలను చెరువు కట్టపైనా, నీటిలో వేయడం వల్ల దుర్గంధం వస్తోంది. బతుకమ్మ కుంట పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి అభివృద్ధి చేస్తే సాయంత్రం వేళ కుటుంబాలతో కలిసి ఆహ్లాదం గడిపే అవకాశం ఉంటుంది. .

● గుండెబోయిన సురేష్‌యాదవ్, నల్లగొండ

బతుకమ్మ కుంట చెరువును అభివృద్ధి చేయాలి



బతుకమ్మ కుంట చెరువును అభివృద్ధి చేస్తే నల్లగొండ పట్టణానికి ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా మారనుంది. ప్రభుత్వం వెంటనే బతుకమ్మ కుంట చెరువుకు సంబంధించి అభివృద్ధి పనులను పూర్తిచేయాలి. మార్నింగ్ వాకర్స్‌కు ఎలాంటి ఆంటకం లేకుండా సౌకర్యాలు కల్పించాలి. రాత్రిపూట చెరువు కట్టపై నుంచి నల్లగొండ పట్టణానికి, కాలనీలకు వచ్చిపోయే విధంగా లైట్లు అమర్చాలి.

● నూర్ మహ్మద్, నల్లగొండ

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



క్లాక్‌టవర్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసిన సమగ్రశిక్ష ఉద్యోగులు

నల్లగొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె గురువారం నాటికి 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు గడియారం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, 24 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీసీసీ హోదాలో హామీ ఇచ్చి, ప్రస్తుతం సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, రాజు, సీఐటీయూ జిల్లా నాయకులు దండెంపల్లి సత్తయ్య, సంఘం నాయకులు మహేందర్, క్రాంతికుమార్, చంద్రశేఖర్, నీలాంబరి, మంజుల, సావిత్రి, పుష్పలత, చౌడోజు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

కనగల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని డీఎంహెచ్‌వో పి. శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ స్టోర్‌ను తనిఖీ చేశారు. మందుల స్టాక్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్, డాక్టర్ రామక్రిష్ణ తదితరులు ఉన్నారు.

జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించాలి

నార్కట్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించి భవనం నిర్మించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీ రాందేవ్, యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎడ్ల మహాలింగం కోరారు. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. కళాశాలకు సొంత స్థలం సమకూరిస్తే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు ఇంటర్ బోర్డు సిద్ధంగా ఉందన్నారు. రెండేళ్ల కిందటే మంజూరై తరగతులు నిర్వహిస్తున్నా కాలేజీ ఇంకా అద్దె భవనంలోనే కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్, సురేశ్, రాజేశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

చిట్యాల, జనవరి2, (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్లు దూడల బిక్షం గౌడ్, మైల నర్సింహ కోరారు. చిట్యాలలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కూరెల్ల శ్రీను, గంజి గోవర్ధన్, ఈడ్దుల మల్లేష్, పాల రవివర్మ, కన్నెబోయిన మహలింగం, గుండాల నరేష్, చికిలంమెట్ల అశోక్, జయారపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ విద్యారంగం బలపడాలి'

చిట్యాల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో ప్రభుత్వ విద్యారంగం మరింత బలపడాలని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బడుగు అరుణ ఆకాంక్షించారు. సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని గురువారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఏశమల్ల నాగయ్య, మాజీ అధ్యక్షుడు బొప్పని యాదయ్య, రామలింగయ్య, జానకి, చంద్రశేఖర్, శ్రీరాములు, సత్యపాల్, సాదిక్ పాల్గొన్నారు.

ఏబీ బర్ధన్ ఆశయాలు సాధించాలి



బర్ధన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నల్లగొండ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన క్యాదర్శి ఏబీ బర్ధన్ ఆశయాలు సాధించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపు నిచ్చారు. బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్మికులు, రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, వెంకటేశ్వర్లు, వెంకన్న, లెనిన్, అంకులయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయుల దినోత్సవ ప్రకటన హర్షణీయం

నల్లగొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే జయంతి రోజైన జనవరి 3ను మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించటం హర్షణీయమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ దశాబ్ద కాలంగా ఈ డిమాండ్ చేస్తోందన్నారు. భర్త జ్యోతిబాపూలే ప్రోత్సాహం ఉన్నప్పటికీ ఆమె సాహసమే ఉపాధ్యాయురాలిగా నిలిపిందని, బాలికల విద్య కోసం ఆమె ఎంతగానో కృషిచేశారని కొనియాడారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : ఎమ్మెల్యే



గురుకుల పాఠశాలలో వంటలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు రూరల్, జనవరి2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన సదుపాయాలు కల్పించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బోడంగిపర్తిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. తరగతి గదులు, స్టోర్‌రూం, వంటగది, బాత్‌రూమ్, డ్రైనేజీలను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉదయం చన్నీళ్ళతో స్నానం చేసున్నారని అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో సోలార్ హీటర్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కూరగాయలు, అన్నం, సాంబారు, వండిన కూరలను పరిశీలించారు. ప్రతి రెండు సంవత్సరాలకోసారి వంట పాత్రలు మార్చాలని సూచించారు. అన్ని గురుకులాల్లో టీచింగ్ స్టాఫ్, హాస్టల్ సిబ్బంది వేర్వేరుగా ఉండాలన్నారు. టీచింగ్ స్టాఫ్‌కే హాస్టల్ నిర్వహణ బాధ్యతలు ఉండడంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుధాకర్‌రెడ్డి, కొరిమి ఓంకారం, మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న ఉన్నారు.

కలెక్టర్, ఎస్పీకి పలువురి శుభాకాంక్షలు

నల్లగొండ, కట్టంగూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్‌కు మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ శరత్ చంద్రపవార్‌కు డ్వాట్ ప్రధాన కార్యదర్శి, ఏఐసీబీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు అందజేశారు. తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ ఇలా త్రిపాఠికి, అద నపు కలెక్టర్ శ్రీనివాస్‌కు, జిల్లా రెవెన్యూ అధికారి అమరేందర్‌కు, నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డిలకు సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగిరి కుమార్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పేద ప్రజల సహాయార్థం సంఘం తరుపున దుప్పట్లు, పేద విద్యార్థులకు నోట్‌పుస్తకాలను కలెక్టర్‌కు అందజేశారు.





కలెక్టర్ ఇలా త్రిపాఠికి శుభాకాంక్షలు తెలుపుతున్న మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి, ఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న చొక్కారావు

క్రీస్తు మార్గం అనుసరణీయం



కమ్మగూడెం చర్చి వేడుకల్లో ప్రార్థనలు చేస్తున్న పాదర్లు

మునుగోడు, జనవరి 2: క్రీస్తు మార్గం అనుసరణీయమని ఉమ్మడి జిల్లా మేత్రాసనం పీఠాధిపతి ధామస్‌కుమార్ అన్నారు. మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కమ్మగూడెం యేసునామకరణ దేవాలయం(చర్చి) వార్షికమహోత్సవ వేడుకలను వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన దివ్యబలి పూజలో క్రీస్తు సందేశాలను వినిపించారు. శాంతి, ప్రేమ, దయ, కరుణ మార్గాలను అందించిన ఏసుక్రీస్తు జీవితం మానవాళికి ఆదర్శప్రాయమన్నారు. చర్చి విచారణ గురువు పాదర్ ధన్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు జిల్లా పరిసర ప్రాంతాల నుంచి వివిధ చర్చిల ఫాదర్లు, మతకన్యలు, క్రైస్తవులు తరలివచ్చారు. సాయంత్రం బాలఏసు, మరియామాత ఉత్సవిగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని చర్చితో పాటు మరియామాత, ముఖద్వారాలు రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులు మిరిమిట్లు గొలుపుతున్నాయి.

హమాలీ కార్మికుల రేట్ల జీవోను విడుదల చేయాలి

నకిరేకల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికుల రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులకు పెరిగిన రేట్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాల రేట్ల ఒప్పందం కాలపరిమితి ముగిసి సంవత్సరం దాటి పోయిందన్నారు. గత సంవత్సరం అక్టోబరు నెలలో పౌర సరఫరాల అధికారులకు యూనియన్ నాయకులకు మధ్య చర్చలు జరిగి రేట్లు పెంచాలని నిర్ణయించినప్పకీ ఇప్పటి వరకూ జీవో విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి దొనకొండ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గోదాం మేస్త్రీ భద్రయ్య, కార్మికులు అశోక్, శ్రీనివాస్, పరమేష్, ముత్తయ్య, రవి, బాలస్వామి, సైదులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్, (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్ కార్మికుల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం పెరిగిన ధర జీవోను విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్‌చేశారు. హమాలీల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఎగుమతి, దిగుమతి రేట్లను రూ.26 నుంచి రూ.29 వరకు పెంచినా జీవోను నేటికి విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ సరుకులు సకాలంలో గోదాముల నుంచి అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లా దేవేందర్ రెడ్డి, దొనకొండ వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, నాగరాజు, జానయ్య, శివ పాల్గొన్నారు.



నకిరేకల్‌లో గోదాం ఎదుట నినాదాలు చేస్తున్న హమాలీ కార్మికులు

నల్లగొండ పట్టణ అభివృద్ధే లక్ష్యం : బుర్రి

రామగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బస్టాండ్ నుంచి గొల్లగూడ ప్రాంతంలో రోడ్డు వెడల్పు పనులను గురువారం శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కాకుండా రోడ్డును త్వరగా పూర్తిచేయాలన్నారు. ఇదే క్రమంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్, అబ్బగొని రమేష్ నాయకులు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శాలిగౌరారం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలోని 100సీట్లకు ప్రవేశాలు ఉంటాయని, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మాత్రం ఖాళీలను భర్తీ చేస్తామని పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరికి, దివ్యాంగులకు ప్రవేశ పరీక్ష ఫీజు రూ.125, ఓసీలకు రూ.200 చెల్లించి జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేత

కట్టంగూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుఅన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామపంచాయతీ సెక్రటరీ మామిడి ఉపేందర్ వాలీబాల్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కందాల రమ, పీఈటీ చింతకాయల పుల్లయ్య ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కట్టంగూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రవీందర్ సూచించారు. దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని కట్టంగూరు, అయిటిపాముల గ్రామస్థులకు అవగాహ కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సతీష్, శంకర్, నవీన్, మహ్మద్ జునైద్ ఉన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నార్కట్‌పల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను నార్కట్‌పల్లిలోని సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఎనుగుల శ్రీనివాస్‌రెడ్డి, బసిరెడ్డి రవీందర్‌రెడ్డి, గోనె అయ్యపురెడ్డి, చిక్కుళ్ల మదనయ్య, వై.సత్యనారాయణ, ఇద్దయ్య, సామ రామచంద్రారెడ్డి, ఆర్.వెంకన్న, అంజయ్య, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, గంగాధర్, నరేశ్, లింగారెడ్డి, విష్ణుమూర్తి, రమణ భార్గవ్ పాల్గొన్నారు.

నేరడ ఆలయంలో 18వ పాశురాం పారాయణం

చిట్యాలరూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడలో సీతారామాంజనేయస్వామి దేవాలయంలో, 44వ మార్గళి దనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం 18వ రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవాలయంలో తిరుప్పావై ద్రావిడ ప్రబంధ 18వ పాశురంను పారాయణం గావించి మంగళనీరాజనాలు సమర్పించారు. భక్తులు దేవాలయంలో పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. తిరుప్పావై 18వ పాశురంను పారాయణం గావించి పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలనందించి ఆశీర్వచనాలు అందజేశారు.

నల్లగొండ

నకిరేకల్ - మునుగోడు

జానారెడ్డికి డాక్టరేట్



కనగల్, జనవరి 2: (ఆంధ్రజ్యోతి) మండలంలోని బాబాసాయిగూడెం గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సుంకిరెడ్డి జానారెడ్డికి తమిళనాడు రాష్ట్రంలోని అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గణితశాస్త్రంలో 'నాన్‌న్యూటోనియన్‌ఫ్లో ప్రాబ్లమ్స్ ఓవర్ ఎ స్ట్రెచింగ్ షీట్ ఇన్‌ప్రజెన్స్ ఆఫ్ మాగ్నటిక్ ఫీల్డ్' అనే అంశంపై అన్నామలై యూనివర్సిటీ గణితశాస్త్ర ఆచార్యుడు డాక్టర్ వలసామి, వర్ధమన్ ఇంజనీరింగ్ కళాశాల గణితశాస్త్ర ఆచార్యుడు డాక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు.

సఫ్దర్ హష్మీ ఆశయాలు సాధించాలి

నల్లగొండ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తన జీవితాన్ని వీధి నాటక ప్రక్రియకు అంకితం చేసిన గొప్ప కళాకారుడు సఫ్దర్ హష్మీ అని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ అన్నారు. స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో గురువారం సఫ్దర్ హష్మీ 35వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుల అచ్చాలు, సత్తయ్య, పి. నర్సిరెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పశుపక్ష్యాదుల కోసం పండ్ల మొక్కలు

నార్కట్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పశు పక్ష్యాదులకు ఆహారంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిరోజూ ఐదు పండ్ల మొక్కలు నాటేందుకు సంకల్పించినట్లు పర్యావరణ ప్రేమికుడు, క్లీన్ హోం-గ్రీన్ హోం సంస్థ వ్యవ స్థాపకుడు ఆదిమళ్ల మణిరాజు తెలిపారు. తాను ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మండలంలోని ఏపీ లింగోటం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గురువారం ఐదు అల్లనేరెడు పండ్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు హెప్సీబా, రోపాలు సత్యనారాయణ, దేవులపల్లి భాస్కర్, సత్యనారాయణ, మహ్మద్ ఆరిఫ్, హేమలత ఉన్నారు.

భూకబ్జా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి

నాంపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డెపల్లి గ్రామంలో 2004 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం సర్వే నెంబర్ 1, 2, 3లలో ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించి పంపిణీ చేసిందని గ్రామస్థులు తెలిపారు. మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేదని, గ్రామానికి చెందిన కొందరు ఆ ప్లాట్లలో హద్దులు తొలగించి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు వారు తహసీల్దార్ దేవసింగ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వట్టికోటి కొండయ్య, బచ్చనబోయిన అయ్యన్న, ఉడుత ముత్యాలు, పొలగోని లచ్చినారి, కాటిక జనార్ధన్, వట్టికోటి కిరణ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

చిట్యాలరూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ అన్నారు. మండలంలోని వెలిమినేడులో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రైతుల రుణమాఫీతో రాష్ట్ర ప్రభుత్వం దేశచరిత్రలో నిలిచిందన్నారు. ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తోందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఐయూఎంఎల్ జిల్లా అధ్యక్షుడిగా చాంద్‌పాషా

రామగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌కే. చాంద్‌పాషా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ షకీల్ నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు చాంద్‌పాషా కృతజ్ఞతలు తెలిపారు.


సీపీఎం ఆధ్వర్యంలో శ్రమదానం

చిట్యాలరూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిమినేడులోని సుర్కంటిగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు గురువారం శ్రమదానం చేశారు. మురుగు కాల్వ అసంపూర్తిగా ఉండడంతో వర్షపు నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కలుగుతుండటంతో ఎక్స్‌కవేటర్‌తో గుంత తీయించారు. నీరు నిల్వ ఉండకుండా పైపులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుర్కంటి మోహన్‌రెడ్డి, పంది నరేష్, గడ్డం నర్సిరెడ్డి, నాతి వెంకట్రామయ్య, సుర్కంటి బుచ్చిరెడ్డి, అరూరి శంభయ్య, సుర్కంటి రాంరెడ్డి, అరూరి నర్సింహ పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ



తిప్పర్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తామని టీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు తండు నర్సింహ గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని మోడల్ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు టై, బెల్టులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బైరగోని శ్రీనివాస్‌గౌడ్, జాకటి బాలరాజు, వెలుగుపల్లి శ్రీనివాస్, జానీపాష, పొలగోని సాలయ్య, రవి, శ్రీను పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.117	190	210
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 17.4

ప్రత్యేక దర్శనాలు షురూ

● వృద్ధులు, చంటిపిల్లల తల్లులు, దివ్యాంగులకు బ్రేక్ తరహా దర్శనాలు

యాదాద్రి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. మరోవైపు రద్దీకి అనుగుణంగా భక్తులకు స్వామివారి దర్శనానికి ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఉద్ఘాటనకు ముందు సాధారణ రోజుల్లో రోజువారీగా 6నుంచి 10 వేల మంది వరకు దర్శించుకోగా, సెలవు రోజుల్లో 30వేలకు పైగా భక్తులు దర్శించుకునేవారు. అయితే ఉద్ఘాటన అనంతరం భక్తుల తాకిడి పెరిగింది. ప్రస్తుతం సాధారణ రోజుల్లో 20వేల మంది భక్తులు దర్శనాలు చేసుకుంటుండగా, సెలవు రోజుల్లో 50వేల వరకు విచ్చేస్తున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ నెల 1న 70వేలకు పైగా మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఒక్కరోజు ఆదాయం రూ.83లక్షలు వచ్చింది. కొండపైకి ప్రవేశ వాహనాలు ద్వారానే రూ.9లక్షలు (1,800 వాహనాలు గుట్టపైకి వచ్చాయి.), ప్రసాద విక్రయం ద్వారా రూ.30లక్షల వరకు ఆదాయం వచ్చింది. దీన్ని బట్టి ప్రత్యేక సెలవురోజుల్లో ఎంతమంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకుంటున్నారో అంచనా వేయొచ్చు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా..

(మిగతా 6వ పేజీలో)



మళ్లీ భయపెడుతున్న ఫ్లోరైడ్





- ఉమ్మడి జిల్లాలోని భూగర్భజలాల్లో నాణ్యతా లేమి
- నీటిలో పరిమాణానికి మించి నైట్రేట్, ఆర్సనిక్, ఐరన్, సోడియం మూలకాలు
- తాగడానికే కాదు, సాగుకూ ఉపయుక్తం కాదంటున్న నివేదికలు
- కేంద్ర భూగర్భజలాల నాణ్యత నివేదికలో మోగిన డేంజర్‌బెల్స్
- మర్రిగూడ మండలంలో గర్భిణుల్లో ఫ్లోరోసిస్ లక్షణాల నిర్ధారణ
- కృష్ణా జలాలు అందించడమే పరిష్కారం

ఉమ్మడి జిల్లాను ఫ్లోరైడ్ భూతం వీడటం లేదు. విచ్చలవిడిగా భూగర్భజలాల వినియోగం, అదుపులేని పరిశ్రమల కాలుష్యంతో భూగర్భజలాల నాణ్యత పడిపోయింది. ఫ్లోరైడ్‌తో పాటు, నైట్రేట్స్, ఇనుము, ఆర్సనిక్ పరిమాణాలు పెరిగాయి. వీటి పెరుగుదలతో ప్రాణాంతక క్యాన్సర్, మూత్రపిండాల రోగాలు, కాళ్లు చేతులు చచ్చుబడడం, దంతక్షయం, పంటలకు అవసరమైన పోషకాలు అందకపోవడంతో నాణ్యతలేని ఆహార ఉత్పత్తులు దిగుబడి అవుతున్నాయి. దేశంలో అత్యధిక ఫ్లోరైడ్, నాణ్యతలేని భూగర్భజలాలు ఉన్న జిల్లాగా యాదాద్రి జిల్లా నిలిచింది. ఉమ్మడి జిల్లాలోని భూగర్భజలాలు సాగుకు, తాగు నీటికి అంత ఉపయుక్తకరం కాదని తాజాగా కేంద్ర జలశక్తి శాఖ విడుదల చేసిన భూగర్భజలాల నాణ్యత నివేదిక వెల్లడిస్తోంది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ప్రభుత్వాలు దశాబ్దాలుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఫ్లోరైడ్ బాధ నుంచి, మూసీ నది కాలుష్యం నుంచి ఉపశమనం కల్పిస్తామని పదేపదే హామీలిస్తున్నా, అందుకు అవసరమైన ఉపరితల జలాలను జిల్లాకు అందించడంలో విఫలమవుతున్నాయి. తాగునీటికి మిషన్‌భగీరథ వంటి పథకాలు, ఆర్వో ప్లాంట్ల ద్వారా నీటిశుద్ధి జరుగుతుండడంతో కొంతమేర ఇబ్బందులు తగ్గినా, ఉమ్మడి జిల్లాలోభూముల్లో, భూగర్భజలాల్లో పేరుకుపోయిన ఫ్లోరైడ్, ఇతర ప్రమాదకర మూలకాలు తొలగాలంటే భూగర్భజలాల వినియోగం తగ్గడం, ఉపరితల జలాల వినియోగం పెరగడమే ఏకైక నివారణ మార్గం. ప్రభుత్వం ఇప్పటికైనా ఉమ్మడి జిల్లాలో వందశాతం ఉపరితల జలాలు అందించే ఎస్ఎల్‌బీసీ, డిండి, గోదావరి జలాల పథకాలను పూర్తిచేయడంతో పాటు, మూసీ ప్రక్షాళన, పరిశ్రమల కాలుష్యాన్ని నివారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

వదలని ఫ్లోరైడ్ భూతం

కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన భూగర్భజలాల నాణ్యత నివేదిక ప్రకారం దేశంలోనే అత్యధిక ఫ్లోరైడ్ నమోదైన 15 జిల్లాల్లో యాదాద్రి జిల్లా ఒకటిగా నిలిచింది. అదేవిధంగా నల్లగొండ జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లోనూ ఫ్లోరైడ్ శాతం ఇటీవల పెరిగింది. గడచిన పదేళ్లలో భూగర్భజలాల్లో 2015 నుంచి 2022 వరకు వరుసగా పెరుగుతూ వచ్చిన ఫ్లోరైడ్ 2023లో 2021కి సమానంగా నమోదైంది. 2015లో నీటిలో 20శాతం ఉన్న ఫ్లోరైడ్ 2022 నాటికి 32శాతానికి చేరింది. యాదాద్రి జిల్లాలో 43 నమూనాలు సేకరించి పరీక్షించగా, అందులో 49 శాతం అంటే 21 శాంపిళ్లలో ఫ్లోరైడ్ 1.5ఎంజీ/లీటర్ కంటే ఎక్కువగా నమోదైంది. యాదాద్రి జిల్లాలో సగటున 6.54 శాతం నమోదయితే, నల్లగొండలోనూ 5.89 శాతంగా నమోదైంది. నల్లగొండ జిల్లాలోని మర్రిగూడ మండలంలో ఇటీవల నిర్వహించిన ఫ్లోరైడ్ సర్వేలోనూ ఫ్లోరోసిస్ మూలాలున్నట్టు అధికారులు గుర్తించారు. అయితే శాంపిళ్లకు సంబంధించిన తుది ఫలితాలు రానందున లక్షణాలు గుర్తించినట్లుగానే చెబుతున్నా నిర్ధారించడం లేదు.

పెరిగిన రసాయనాలు, కాలుష్యకారకాలు

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా

మిగతా 7వ పేజీలో...

గర్భిణుల్లో లక్షణాలు కనిపించడంతో పరీక్షలకు పంపాం



మర్రిగూడ మండలంలో ఇటీవల నిర్వహించిన ఫ్లోరోసిస్ పరీక్షల్లో గర్భిణుల్లో లక్షణాలు కనిపించడంతో మూత్ర నమూనాలను పరీక్షలకు పంపాం. ఆ నివేదికలు రావల్సి ఉంది. ఇతరుల్లో ఫ్లోరోసిస్ లక్షణాలేవీ కనిపించలేదు. కొత్తగా ఫ్లోరోసిస్ ఎవరికీ రాలేదు. పాతవారిలోనూ ఆ ప్రభావం తగ్గింది.

డాక్టర్ శాలిని, వైద్యాధికారి, మర్రిగూడ

శాశ్వత పరిష్కారం కోసం ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి ఎత్తిపోతల పూర్తిచేయాలి



ప్రభుత్వాలు ఉపశమన చర్యలు ఎన్ని చేపట్టినా శాశ్వత పరిష్కారమార్గం చూపడం లేదు. కృష్ణానది జలాలను పూర్తిస్థాయిలో అందించినప్పుడే ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారమవుతుంది. 35 ఏళ్లుగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసినా ఫలితం దక్కకపోవడం బాధాకరం. ఎస్ఎల్‌బీసీ టన్నెల్, డిండి ఎత్తిపోతల పథకం పూర్తయితేనే ఫ్లోరోసిస్ నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

కంచుగట్ల సుభాష్, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు

జిల్లాకు పేరు తెచ్చేలా కృషి చేయాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో అధికారులు, సిబ్బంది జిల్లాకు మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు, బెడ్‌షీట్లు, నోట్ పుస్తకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, సామాజిక, ఆర్థిక, సమగ్ర కుటుంబ సర్వేలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇదే ఒరవడిని నూతన సంవత్సరంలో కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి అమరేందర్, ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, సర్వే లాండ్స్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, పాల్గొన్నారు.

టెట్ పరీక్షా కేంద్రం తనిఖీ

ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించే టెట్ ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలాత్రిపాఠి తనిఖీ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రానికి 180మంది అభ్యర్థులను కేటాయించగా, 118 మంది హాజరైనట్టు నిర్వాహకులు వివరించారు. కలెక్టర్ వెంట డీఈవో భిక్షపతి ఉన్నారు.



నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి కలెక్టర్ ఇలాత్రిపాఠికి దుప్పట్లు అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్, నాంపల్లి): విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం కనగల్ కేజీబీవీని ఆమె తనిఖీ చేసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు అందజేశారు. పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అదనపు తరగతులను ప్రభుత్వం మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పద్మ, ఎంఈవో పద్మ, ఎంపీవో సుమలత ఉన్నారు. నాంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీచేశారు. 'ధరణి' పెండింగ్ దరఖాస్తుల వివరాలు తహసీల్దార్ దేవ్‌సింగ్‌ను అడిగి తెలుకున్నారు.

అక్షయపాత్ర కోసం స్థలం పరిశీలన

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): హరేకృష్ణ సంస్థ ద్వారా గురుకులాలు ఇతర ప్రభుత్వ సంస్థలకు భోజనం సరఫరా చేసే అక్షయ పాత్ర కోసం మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ ఇలాత్రిపాఠి గురువారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం అమలవుతున్న విద్యా సంస్థలు, వసతి గృహాలు, అన్నపూర్ణ క్యాంటీన్‌లకు భోజనం సరఫరా చేసేందుకు ప్రభుత్వం హరేకృష్ణ సంస్థకు బాధ్యతలు అప్పజెప్పే ఆలోచనలో ఉంది. అందులో భాగంగా అక్షయపాత్ర వంటశాల, ఇతర నిర్మాణాలకు ఎకరం స్థలం కోసం ఎల్లారెడ్డిగూడెంలో హరిత హోటల్‌కు ఇవ్వనున్న స్థలం పక్కన స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ తరుణ్, వడ్డే భూపాల్‌రెడ్డి, కిట్టు, అశోక్ ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

- చిన్న పిల్లలతో వెట్టి చాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు
- బాలకార్మికులు కనిపిస్తే 1098, 100కు డయల్ చేయాలి
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పాల్గొన్న అదనపు ఎస్పీ రాములునాయక్

నల్లగొండ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎంతటి వారైనా చిన్న పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే కేసులు నమోదు చేయాలని, బాల కార్మికులు కనిపిస్తే 1098, 100కు డయల్ చేసే సమాచారం ఇవ్వాలన్నారు. నిరాదరణకు గురైన, తప్పిపోయిన, వెట్టి చాకిరికి గురవుతున్న బాలబాలికలను గుర్తించి వారిని సంరక్షించడం మనందరి బాధ్యత అన్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, అదేవిధంగా జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జనవరి ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు నెలరోజులపాటు పోలీస్ అధికారులు, బాల కార్మిక, విద్యా, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి పని చేసే పిల్లలను గుర్తించాలన్నారు. 18 ఏళ్లలోపు వారిని గుర్తించిన వెంటనే, తల్లిదండ్రులకు లేదంటే స్టేట్‌హోంకు తరలించాలన్నారు. బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ అరుణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కృష్ణవేణి, బాల కార్మిక, విద్యా, ఆరోగ్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మరణించినా జీవించు..

● అవయవ దానంతో ఆర్తుల జీవితాలకు వెలుగు 6



కొనుగోలు చేస్తామని పిలిచి..

పొమ్మన్నారు

7 చండూరు మండలంలో పత్తి రైతుల రాస్తారోకో

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

దేవరకొండ ఏఎస్పీ మౌనిక



శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపారు. దేవరకొండ పోలీస్ సబ్ డివిజన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ, దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. దేవరకొండ సబ్ డివిజన్ అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆమె గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● ఆంధ్రజ్యోతి, దేవరకొండ

ఆంధ్రజ్యోతి: దేవరకొండ డివిజన్‌లో దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడతారు?

ఏఎస్పీ: డివిజన్‌లో దొంగతనాల నివారణ, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. ఎస్పీ శరత్ చంద్రపవార్ సూచనల మేరకు నేరాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

ఆం: సైబర్ నేరాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఏఎస్పీ: ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయి. కొత్త వ్యక్తులు ఫోన్‌చేసి బ్యాంక్, ఆధార్‌కార్డు, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పవద్దు. ఫోన్‌చేసి కొత్త వ్యక్తులు ఇబ్బందులుపెడితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.

ఆం: మొదటిసారిగా ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు, ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఏఎస్పీ: ఎస్పీ శరత్‌చంద్రపవార్ సహకారం, పోలీస్ అధికారులు, సిబ్బంది సహాయ, సహకారాలతో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా దేవరకొండ డివిజన్ గిరిజన ప్రాంతంకావడంతో గ్రామాల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించి సేవా కార్యక్రమాలు చేపడతాం.

ఆం: దేవరకొండ పట్టణంతోపాటు గ్రామాల్లో నడుస్తున్న బెల్టుషాపులు, ఘర్షణలపై మీ చర్యలు ఎలా ఉంటాయి?

ఏఎస్పీ: నూతనంగా బాధ్యతలు చేపట్టాను. అన్ని పోలీస్ స్టేషన్లు, గ్రామాల్లో పర్యటించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహిస్తే దాడులు చేసి చర్యలు తీసుకుంటాం.

హిందూ ధర్మపరిరక్షణకు కృషి చేయాలి : శ్రీధర్ స్వామి



శ్రీధర్ స్వామికి స్వాగతం పలుకుతున్న ట్రస్టు సభ్యులు

చింతపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మపరిరక్షణ కోసం కృషి చేయాలని ముక్కామాల ఆశ్రమ పీఠాధిపతి శ్రీధర్ స్వామి అన్నారు. మండల కేంద్రంలోని సాయిసన్నిధిలో సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ట్రస్టు ఛైర్మన్ సభ్యులు శ్రీధర్ స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి వూరె కృష్ణయ్య, గోశాల ఇన్‌చార్జి కుంభం పుల్లా రెడ్డి, సభ్యులు తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి : ఎంఈవో



నిడమనూరులో యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో, సంఘం నాయకులు

తిరుమలగిరి(సాగర్), జనవరి 2(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ విద్యను బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో కె.శ్రీనివాస్ సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన టీఎస్ యూ టీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వడిత్య రాజు, ఎరనాగుల సైదులు, గంజి శ్రీదేవి, ఎం.నాగమణి, అంజిబాబు, రమణ, అమృతయ్య, జానిపాషా, సత్యనారాయణ, విజయలక్ష్మీ, నరేషా, భాను, వెంకటేశ్వర్లు, రాములు, సరోజిని, దేవి, గౌసియా, కుమారస్వామి పాల్గొన్నారు.

● నిడమనూరు,(ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీభవనంలో ఎంఈవో లావూరి వెంకన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కొమరాజు సైదులు, మండల ప్రధాన కార్యదర్శి లింగంపల్లి అంజయ్య, తోట ఝూ న్సీ కంచి సైదయ్య, కర్నాటి శ్రీనుకుమార్, ప్రతాప్, బొమ్ము ఉపేందర్, సైదులు, అశోక్, చంద్రకళ, జబ్బార్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి జానారెడ్డి పరామర్శ



వాసుదేవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జానారెడ్డి

హాలియా, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన రిక్కల వాసుదేవరెడ్డి బుధవారం మృతి చెందారు. హాలియాలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి వాసుదేవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు బెడుదూరి వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, పోషం శ్రీనివాస్ గౌడ్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

ట్రేసా క్యాలెండర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఆవిష్కరించారు. గురువారం సబ్ కలెక్టర్ చాంబర్‌లో డివిజనల్ పాలనాధికారి శర్మ, తహసీల్దార్ హరిబాబుతో కలిసి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రేసా డివిజన్ అధ్యక్షుడు హజీ, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సందీప్, జమాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలపై చర్యలేవీ..?

▸▸ ఫిర్యాదు చేసినా పట్టింపులేని యంత్రాంగం ▸▸ చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘాల విజ్ఞప్తి

మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు కొన్నేళ్లుగా కబ్జాకు గురయ్యాయి. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మత్స్య కారులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించు కోవడం లేదు.

(త్రిపురారం -ఆంధ్రజ్యోతి)



వరి నాటుకు సిద్ధం చేసిన నర్లకంటిగూడెం చెరువు

మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్లకంటిగూడెంలో 58.28 ఎకరాల్లో నర్లకుంట వ్యాపించి ఉంది. ఈ చెరువులో చేపల పెంపకంతో మత్స్యకారులు జీవనం సాగించేవారు. దశాబ్దాలుగా చెరువు చుట్టూ పక్కల భూములు ఉన్న వాళ్లు కబ్జా చేయడం మొదలు పెట్టారు. గతేడాది ఏప్రిల్‌లో ఈ చెరువులో మట్టి పోసి ఎక్స్‌కవేటర్‌తో చదును చేశారు. సుమారు 40 ఎకరాల వరకు కబ్జా గురైంది. మత్స్యకారులు పనులను అడుకుని అదే రోజు కలెక్టర్, ఎస్‌ఎస్పీ, రెవెన్యూ, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి కలెక్టర్ హరిచందన చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేసి హ ద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ తరువాత అధికారులు చెరువును పరిశీలించారు. సర్వే చేసి కబ్జాలు తొలగిస్తామని మత్స్యకారులకు హామీ ఇచ్చారు. ఆక్రమ ణలకు పాల్పడిన వారిపై మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఎస్పీ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు మాత్రం నమోదు కాలేదు. ఇప్పటికి 8 నెలలుగా కనీసం అధి కారు లు చెరువు వైపు కన్నెత్తి చూడలేదు. దాంతో అక్రమ ణ దారులు మట్టిని చదును చేసుకుని వానాకాలంలో వరి సాగు చేసుకున్నారు. యాసంగి సాగుకు దమ్ము చేసి నాటుకు సిద్ధమయ్యారు. మత్స్యకారులు మాత్రం అన్ని శా ఖల అధికారులను వేడుకుంటున్న కనికరించే వారే కరు వయ్యారు. కబ్జాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు..

62 ఎకరాలు బెజ్జికల్ చెరువులు ఆక్రమణ

మండలంలోని బెజ్జికల్‌లోని తూర్పు, పడమర చెరువులు ఆక్రమణలో ఉన్నాయి.. రెండు చెరువులు విస్తీర్ణం 72 ఎకరాల వరకు ఉంటుంది. మండల కేంద్రానికి కేవలం రెండు కిలో మీటర్ల దూరంలో ఉండటంతో ఈ ప్రాంతంలో భూముల ధరలు అధికంగా ఉన్నాయి. రెండు చెరువులు కలిపి 62 ఎకరాల వరకు కబ్జాకు గురైంది. కేవలం పది ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. రెండు దశాబ్దాల క్రితం మొదలైన ఆక్రమణల పర్వం నేటికి సాగుతూనే ఉంది. తెల్ల కాగితాల క్రయాల విక్రయాలు ఇప్పటికి జరుగుతూనే ఉన్నాయంటే ఆక్రమణలు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. చెరువుల పై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులు రోడ్డున పడ్డారు. ఆక్రమణలను తొలగించాలని వేడుకుంటున్నారు.

కంపాలపల్లి చెరువు కనుమరుగు

మండలంలోని కంపాలపల్లి చెరువు సుమారు 112 ఎకరాల్లో విస్తరించి ఉండేది. కొన్నేళ్లుగా 40 ఎకరాల వరకు ఈ చెరువును ఆక్రమించారు. చాలామంది చెరువులో బోర్లు వేయడంతో పాటు పంటలు సాగు చేపట్టారు. అయినా ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చెరువు కబ్జాలకు తొలగించాలని గ్రా మస్థులు కోరుతున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

చెరువుల కబ్జాలతో నీటి నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. ఆయకట్టు ప్రాంతంలో ఉన్నప్పటికి బెజ్జికల్ చెరువుల్లో చుక్క నీరు నిల్వ లేదు. చెరువుకు ఉన్న తూములు, అలుగు కబ్జాదారులు ధ్వంసం చేయడంతో వచ్చిన నీరు వెళ్లిపోతుంది.. వేసవి వచ్చిదంటే చాలు ఈ గ్రామంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతా యి. కనీస అవసరాలకు నీటి లభ్యత ఉండటం లేదు..నర్లకంటి గూడెం చెరువు పరిస్థితి ఇదే విధంగా ఉంది.. ఒకప్పుడు ఒక్కో చెరువు కింద 2-3 వందల ఎకరాల ఆయకట్టు ఉండేది.. చెరువులు కబ్జాల వల్ల రైతులు చాలా భూములు పడావు పడ్డాయి.. కొందరు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బోరు బావులు ఏర్పాటు చేసుకున్నారు. చెరువులు పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

జీవనోపాధి కోల్పోయాం



చెరువులు కబ్జాకు గురి కావడంతో జీవనోపాధి కోల్పోయాం.. ఉపాధి లేక చాలా మంది రోడ్డున పడ్డారు. చెరువుల ఆక్రమించిన వాళ్లు డబ్బు పలుకు బడిన ఉన్న వాళ్లు కావడంతో అధికారులు వారికే కొమ్ము కాస్తున్నారు. మా విన్నపాలను పక్కన పడే శారు.. చెరువులు ఆక్రమణలను తొలగించి మా కుటుంబాలను ఆదుకోవాలి.

-సింగం ముత్తయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు

సర్వేయర్లు లేక ఆలస్యం

రెవిన్యూ సర్వేయర్లు అందుబాటులో లేకపోవ డంతో చెరువుల సర్వేలో జాప్యం జరిగింది. సర్వే కోసం కలెక్టర్ నిధులు కేటాయించారు.. వేసవిలో తప్పకుండా సర్వే చేసి ఆక్రమణలు తొలగించి హద్దులు ఏర్పాటు చేస్తాం.

-కేశవ్, డీఈ, ఎన్‌ఎస్‌పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

అందరికీ పనులు కల్పిస్తాం

● డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

దేవరకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధిహామీ పథకంలో అందరికీ పనులు కల్పిస్తామని, విధుల్లో అధికారులు నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం దేవరకొండలో నిర్వహించిన డివిజన్‌స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 1.70లక్ష కుటుంబాలకు జాబ్‌కార్డులు అందజేసి ఉపాధి కల్పించినట్టు తెలిపారు. కూలీలకు 100రోజులు తగ్గకుండా పని కల్పించి రోజుకు రూ.300 తగ్గకుండా కూలి గిట్టుబాటయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉపాధిహామీ సిబ్బందిపై ఉందన్నారు. కొంతమంది సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో నర్సరీల్లో 69 లక్షల మొక్కలు పెంచుతున్నామని, ప్రతీ పంచాయతీకి 5వేల నుంచి 10వేల వరకు ఏడు రకాల మొక్కలు పంపిణీచేస్తామన్నారు. జూలై వరకు మొక్కలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఏపీడీ యామిని, డివిజన్ పరిధిలోని ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పూర్తే లక్ష్యం : ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని శ్రీశైలం సొరంగమార్గం, ఎస్‌ఎల్‌బీసీ, నక్కలగండి, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుల పూర్తే లక్ష్యంగా ముందుకు సాగుతున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన సంవత్సరంలో దేవరకొండ నియోజకవర్గానికి అంతా మేలు జరుగుతుందన్నారు. గుట్టలపై ఉన్న గ్రామాలకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకాలు ప్రారంభించామని పనులు జరుగుతున్నట్లు తెలిపారు. మరో రెండు ఎత్తిపోతల పథకాలకు ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రోడ్లు నిర్మాణానికి రూ.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. దేవరకొండ పట్టణానికి రూ.30 కోట్లతో రోడ్ల పనులు ప్రారంభమైనట్లు ఆయన వెల్లడించారు. ఎస్టీ సబ్‌ప్లాన్, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు కెటాయించి ఎస్సీ, ఎస్టీలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కాంగ్రెస్ నాయకులు ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, ముత్యాల సర్వయ్య. లోకసాని శ్రీధర్‌రెడ్డి, జూలూరి ధనలక్ష్మీబాలనారాయణగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.



దేవరకొండలో వడ్డెర సంక్షేమసంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

వడ్డెర సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

వడ్డెర సంక్షేమసంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే బాలు నాయక్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. వడ్డెరులను ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమసంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ, గండి కోట వెంకటయ్య, నర్సింహ, భిక్షపతి, రవి, రాములు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో పూజలు

చింతపల్లి (ఆంధ్రజ్యోతి : మండలం వెంకటేశ్వరనగర్ లోని సంతోషిమాత ఆలయంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ వూరె లక్ష్మణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, కాంగ్రెస్ అంగిరేకుల గోవర్ధన్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అనుమానిత ఫోన్ నంబర్లు ఎత్తొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేష్, పాఠశాల యాజమాన్యం

మిర్యాలగూడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అనుమానిత ఫోన్ నంబర్లు ఎత్త వద్దని షీటీమ్స్ ఎస్ఐ నరేష్ సూచించారు. స్థానిక గోల్కొండ స్కూల్‌లో గురువారం షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజింగ్, సోషల్ మీడియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు అలవాటు పడుతున్నారని దీని ద్వారా మానసిక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అనుమానిత నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను లిఫ్ట్ చేయక పోవడమే మంచిదని అన్నారు. విద్యార్థి నులు ఆత్మ రక్షణకు కరాటే, బాక్సింగ్, జూడో వంటి విద్యలను నేర్చు కోవాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బెల్లంకొండ ఉపేందర్‌శ్రావణి, ప్రిన్సిపాల్ అజయ్ కుమార్, రాగిరెడ్డి నవీన్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీఎంఆర్ డెలివరీకి అనుమతించాలి

హాలియా, జనవరి 2(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ 2024-25 కు మిల్లర్లు దిగుమతి చేసుకున్న ధాన్యానికి బియ్యం సరఫరా చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి ఇప్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ఇలా త్రిపాఠి పూలమొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వినతి సమర్పించిన వారిలో నల్లగొండ జిల్లా మిల్లర్స్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, అధ్యక్షుడు కర్నాటి నారాయణ, జనరల్ సెక్రటరీ రేపాల భద్రాద్రి రాములు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ జూలకంటి ఇంద్రారెడ్డి, దేవరకొండ తాలుకా అధ్యక్షుడు సముద్రాల వెంకటేశ్వర్లు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శ

చింతపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మాల్ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ దొంతం అలివేలూసంజీవరెడ్డి తల్లి బుచ్చమ్మ ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ గురువారం బుచ్చమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంతం చంద్రశేఖర రెడ్డి, ఆరేకంటి జంగయ్య, ఉజ్జిని రఘునందన్‌రావు, కుంభం శ్రీశైలం, వాంకుడోత్ బాల్‌సింగ్‌నాయక్, బిచ్యా నాయక్, చందర్‌నాయక్, రమావత్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డీఎస్‌వో

గుర్రంపోడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎస్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని బాలికల వసతిగృహాన్ని గురువారం ఆయన పరిశీలించారు. వసతిగృహం చుట్టూ చెట్లు,పొదలు లేకుండా శుభ్రం చేయించాలని సూచించారు. ఎలుకలు, పాములు ప్రవేశం చకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్టోర్ రూమ్, కిచెన్లు పరిశీలించారు. విద్యార్థినిలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో మంజుల, ఆర్ఐసీఎస్ రావుల సైదులుగౌడ్, కేర్‌టేకర్ స్వాతి ఉన్నారు.

సాగర్ విద్యార్థినికి బ్యాడ్మింటన్‌లో గోల్డ్ మెడల్

నాగార్జునసాగర్,జనవరి2(ఆంధ్రజ్యోతి): స్థానిక హిల్‌కాలనీలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సారీక ఈ నెల 1వ తేదీన హైదరాబాద్‌లో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. డిసెంబరు 16వ తేదీన నల్లగొండలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. సారీకను పైలాన్ కాలనీలో ఉన్న కృష్ణక్లబ్ సభ్యులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు అభినందించారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

కొండమల్లేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మికులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రంలో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్‌కు ఎమ్మెల్సీ పరామర్శ

హాలియా, జనవరి2 (ఆంధ్రజ్యోతి): అనముల మండలం యాచారం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ ఇరిగి పెద్దులు ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి గురువారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బాణావత్ బాబురావునాయక్, శివయ్య ఉన్నారు.



జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ ఇరుగు పెద్దులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

● **డాకాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళి**

అనుముల మండలం యాచారం గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈవో నిమ్మల డాకాల్‌రెడ్డి దశదిన కార్యక్రమంలో గురువారం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి డాకాల్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ రాములుగౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నిమ్మల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు నిమ్మల నిరంజన్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

● ఘనంగా నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

హాలియా, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పీసీసీ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి అన్నారు. గురువారం హాలియాలో రెడ్ క్రాస్ సొసైటీ సౌజ న్యంతో తులసీ హాస్పటల్ అధ్వర్యంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్ ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్ పాల్గొన్నారు.



హాలియాలో రక్తదానం చేస్తున్న యువకులు

ఎంపీ రఘువీర్‌కు శుభాకాంక్షలు

తిరుమలగిరి(సాగర్) : తాజా మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, కాంగ్రెస్ హాలియా పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, నాయకులు ప్రసాద్ ఎంపీ రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసం దర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

● దామరచర్ల (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కందుల నరసింహారెడ్డి స్టడీ మెటీరియల్స్ అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బండ వెంకట్‌రెడ్డి, చందాల ప్రశాంత్, మాలోతు శివకుమార్, కాంచాని విజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజలాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం మండల కాంగ్రెస్ నాయకులు ప్లేట్లు, గ్లాస్‌లు, పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పోలగాని సైదులు, గొట్టిముక్కల నాగాచారి, జక్క నాగయ్య, సింగం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవంతీపుర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొంగరాల కిరణ్, వస్కుల గోపి, కుక్కల సురేష్, వస్కుల నాగేష్, శ్రీకాంత్, ఇరుగు సతీష్, హరితేజగౌడ్, కిట్టు, సైదులు, మహేష్ పాల్గొన్నారు.

యాదాద్రి పవర్ ప్లాంటు సీఈ సమ్మయ్యకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు

దామరచర్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ విద్యుత్ పరి శ్రమ చీఫ్ ఇంజినీర్ జాటోతు సమ్మయ్యకు ప్లాంట్‌లోని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూని యన్-1535 నాయకులు గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్ర మంలో వైటీపీఎస్ బ్రాంచ్ అధ్యక్షుడు కాకటి రాము, కార్యదర్శి హెచ్. రమేష్, సంఘం నాయకులు ఖాజా మోనుద్దీన్, వైటీపీఎస్ బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు డి.విజయసారథి, విజయ భాస్కర్‌రెడ్డి, వి.లక్ష్మీనారాయణ, సీహెచ్ .మహేష్, మజర్, సుభాని, రామకృష్ణ, భద్రమ్మ, పద్మ పాల్గొన్నారు.



సమ్మయ్యను శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు